నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 19-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:96 పేజీలు:68 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

తల్లి దండ్రుల
ఆశీర్వచన ఫలం
దక్కితే శుభం.

ముసలితనం
కన్పించె పసితనం
సంతు కవచం.

గ్యారెంటీ మాట
నమ్మకు నీటి మూట
మాట రేపురా.

తెనె లో ఈగ
సంఘనేతల తీరు
చేయాలి పోరు.

మల్లి నాజీలు
జర్మన్‌లో ఆ గాలులు
పునరుత్థానం.

- రేడియమ్

సెల్: 9291527757


పనులు

పనులు దొరకక ఊరిడిసి
వలస బాట పట్టినారు !
తరుముతున్న కరువుకేమొ
నిండు సలాం కొట్టినారు !
కాంగిరేసు పాలనలో
ఎటు చూసినా తొర్రలే !
ఇక నమ్మి నాన పోస్తే
గింజలు పుచ్చు బుర్రలే !

- కందుకూరి శ్రీరాములు

సెల్:9440119245

భద్రతా బలగాల ఎదురుకాల్పుల్లో లతీఫ్ భట్ మృతి..



న్యూ ఢిల్లీ, నవంబర్ 18:జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది లతీఫ్ భట్ హతమయ్యాడు. ఓ మసీదులో దాక్కున్న లతీఫ్ భట్‌ను లొంగిపోవాలని భారత భద్రతా బలగాలు విజ్ఞప్తి చేశాయి. అందుకతడు నిరాకరించాడు. తరువాత బలగాలపై లతీఫ్ భట్ కాల్పులు జరపగా.. భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆ ఉగ్రవాది మృత్యువాత పడ్డాడు. దీంతో జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో భద్రతా బలగాలకు భారీ విజయం లభించింది.

కాగా నవంబర్ 11న అఖ్రూన్‌లో సీఆర్పీఎఫ్ చెక్‌పోస్టుపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ముగ్గురు సీఆర్పీఎఫ్ సిబ్బంది గాయపడిన ఈ దాడిలో లతీఫ్ భట్ కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. దీంతో భారత బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఉగ్రవాదుల ఏరివేతకు పూనుకున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉగ్రవాది ఉమర్ నిసార్‌ను దళాలు ఎన్‌కౌంటర్ చేశాయి. ఈరోజు (బుధవారం) లతీఫ్ భట్ ఆచూకీ కోసం కుల్గాంలో భారీ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఇందులో భాగంగా అతడు ఓ మసీదులో దాక్కున్నట్టు గుర్తించాయి. బయటకు వచ్చి, లొంగిపోవాలని బలగాలు ఆ ఉగ్రవాదికి విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు వీడియో కాల్ ద్వారా లతీఫ్ భట్‌తో పోలీసులు, ఉన్నతాధికారులు మాట్లాడారు. 'నీకు ఇంకా జీవితం ఉంది.. నువ్వు చాలా చిన్నవాడివి' అంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే లతీఫ్ భట్ లొంగిపోయేందుకు నిరాకరించాడు. 'నేను అల్లాహ్‌ను కలవాలనుకుంటున్నాను.. నేను చాలా సంతోషంగా ఉన్నాను' అంటూ సమాధానమిచ్చాడు. తెల్లవారుజామున 2.45 గంటలకు భద్రతా బలగాలపై ఉగ్రవాది కాల్పులు జరిపాడు. దీంతో దళాలు ఎదురుకాల్పులు జరిపాయి.

ఈ కాల్పుల్లో లతీఫ్ భట్ హతమయ్యాడు. మిగతా ఉగ్రవాదుల కోసం బలగాల గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ ఎన్‌కౌంటర్‌పై జమ్మూకశ్మీర్ పోలీసు శాఖ స్పందించింది. 'మీరు పారిపోవచ్చు.. కానీ తప్పించుకోలేరు' అంటూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది.

అతి తీవ్ర తుపానుగా 'అక్వాన్'.. తమిళనాడులోని ఉత్తర జిల్లాలకు భారీ వర్ష సూచన

చెన్నై, నవంబర్ 18: బంగాళాఖాతంలో ఏర్పడి తీవ్ర వాయుగుండం 'అక్వాన్' తుపానుగా బలపడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని ఉత్తర జిల్లాల్లో బుధవారం నుంచి ఆదివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ముంచుకొస్తున్న అక్వాన్ తుఫాన్ బంగాళాఖాతంలో దక్షిణ ఆగ్నేయంగా సుమారు 600 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని, ఇది బుధవారం మధ్యాహ్నం తర్వాత అతి తీవ్ర తుఫాన్‌గా మారి ఆంధ్రప్రదేశ్‌లో తీరం దాటే అవకాశమున్నట్లు వాతావరణశాఖ తెలిపింది.

అక్వాన్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో, చెన్నై, చెంగల్పట్టు, తిరువళ్లూరు, కాంచీపురం, రాణిపేట, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, పుదుచ్చేరి ప్రాంతాల్లో ముందస్తు జాగ్రతలను విపత్తు నివారణ అధికారులు చేపట్టారు. సముద్రంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, మరలా ఉత్తర్వులు జారీ అయ్యే వరకు జాలర్లు చేపలవేటకు వెళ్లరాదని ప్రభుత్వం సూచించింది. ఇదిలా వుండగా, ఈదురుగాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. చెన్నై వాతావరణశాఖ జారీచేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు ప్రభుత్వం సూచించింది.

4.63 లక్షల మందికి పెన్షన్లు..
పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక: మంత్రి సీతక్క



వరంగల్, నవంబర్18: రాష్ట్రంలో 4.63 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నామని తెలంగాణ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ పెన్షన్ లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తున్నామని తెలిపారు.

బుధవారం వరంగల్ జిల్లా సంగెం మండలం స్టేషన్ చింతలపల్లి టెక్స్‌టైల్ పార్క్ వైలాన్ వద్ద రూ. 45 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు చేయూత పెన్షన్ పత్రాలను ఆమె పంపిణీ చేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఇంట్లో ఆడ కూతురు సంతోషంగా ఉండాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఆరాటమని చెప్పారు. మహిళా సంఘాలకు మ్యారేజ్ ఫంక్షన్ హాల్స్ ఇస్తామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులతోపాటు పథకాలన్నీ మహిళల పేరు మీదే ఇస్తున్నామని మంత్రి సీతక్క వివరించారు.

కేవలం ఈ మూడేళ్లలో మహిళా సంఘాలకు రూ. 75 వేల కోట్లు రుణాలు ఇచ్చామని గుర్తు చేశారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా పెట్రోల్ బంక్, సోలార్ పవర్ ప్లాంట్స్‌తోపాటు 300 ప్రాంతాల్లో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు ఇచ్చామని అన్నారు.

మేడారం జాతరలో వ్యాపారాల కోసం మహిళా సంఘాలకు రూ.3 కోట్లు ఇస్తే.. వారు రూ.9 కోట్లు సంపాదించారని సోదాహరణంగా మంత్రి సీతక్క వివరించారు.

ఈ కార్యక్రమంలో హెచ్‌ఏఎం ప్రాజెక్టు కింద రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.

ఈ సభలో ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎంపీ కడియం కావ్య, గ్రంథాలయం సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, కలెక్టర్ సత్య శారదతోపాటు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటర్లకు డిసెంబర్ 22 వరకు అవకాశం..

హైదరాబాద్, నవంబర్ 18: రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును మరోసారి పొడిగిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.

ఈ నెల 30వ తేదీతో ముగియాల్సిన గడువును డిసెంబర్ 22 వరకు పొడిగించింది. దీంతో ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన వారికి అదనపు సమయం లభించనుంది.

అర్హులైన వారికి మరో అవకాశం..

ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది.

గడువు పొడిగింపుతో ఇప్పటివరకు టరు జాబితాలో చోటు దక్కని అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఎన్నికల సంఘం తాజా నిర్ణయంతో ఓటరు నమోదు ప్రక్రియకు మరింత సమయం లభించినట్లయింది.

హైదరాబాద్‌లో డ్రగ్స్ దందా గుట్టురట్టు

హైదరాబాద్, నవంబర్ 18: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్రంగా జోరుగా సాగుతున్న డ్రగ్స్, గంజాయి రవాణా, విక్రయాల దందా గుట్టును పోలీసులు రట్టుచేశారు. ముంబై నుంచి హైదరాబాద్‌కు బస్సుల్లో ఈ గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి.. కుష్, గంజాయిని విక్రయిస్తున్న డ్రగ్స్ పెడ్లర్లను అరెస్ట్ చేయగా.. ముంబైకు చెందిన ప్రధాన నిందితుడు, డ్రగ్స్ సరఫరాదారు షేక్ ఫరహాన్ పరారయ్యాడు. స్నాప్‌చాట్ కేంద్రంగా ఈ దందా కొనసాగుతున్నట్లు గుర్తించారు. కాగా.. నిందితుల నుంచి 1.240 కేజీల గంజాయి, 16.59 గ్రాముల కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ కేంద్రంగా డ్రగ్స్, గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారం మేరకు ఈగల్ ఫోర్స్.. హైదరాబాద్ నార్కోటిక్స్‌తో కలిసి భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఈ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి ఈ దందా గుట్టును పోలీసులు రట్టుచేశారు. ముంబై నుంచి డ్రగ్స్‌ను బస్సుల ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. OGdude420, Dude OG 420 పేర్లతో.. స్నాప్‌చాట్ కేంద్రంగా ఈ దందా కొనసాగుతున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని.. క్రిప్టో కరెన్సీ ద్వారా చెల్లింపులు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. USDT, RedotPay ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆర్థిక లావాదేవీలు కొనసాగినట్లు పోలీసులు గుర్తించారు.

స్నాప్‌చాట్ ద్వారా నిందితులు గతంలోనూ డ్రగ్స్ దందా చేసినట్లు పోలీసులు గుర్తించారు. వారి అకౌంట్లను గుర్తించి బ్లాక్ చేయడంతో.. మరో కొత్త అకౌంట్ ద్వారా ఈ దందాకు మరల తెర లేపినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. ఈ కేసులో అరెస్టైన నిందితుల్లో ఒకరైన హైదరాబాద్ డ్రగ్స్ పెడ్లర్ ఇద్రిస్‌పై గతంలోనూ పలు కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. 2021-22లో బెంగళూరు NCB కేసు, 2025 డిసెంబర్‌లో RGIA విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులకు పట్టుబడిన ఇద్రిస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బెయిల్‌పై వచ్చిన తరువాత కూడా డ్రగ్స్ దందానే కొనసాగిస్తున్నట్లు గుర్తించారు. కాగా.. పరారీలో ఉన్న ముంబైకు చెందిన సరఫరాదారుడు షేక్ ఫరహాన్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

పెట్రోల్ బంక్‌లో మంటలు..

హైదరాబాద్, నవంబర్ 18:నగరంలోని కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సౌమ్యనగర్‌లో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ వాహనదారుడు తన ద్విచక్ర వాహనాన్ని స్టార్ట్ చేస్తుండగా ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగిసిపడి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు బైక్‌ను చుట్టుముట్టడంతో పాటు వాహనదారుడికి కూడా అంటుకున్నాయి. ఈ ఘటనలో ఆ వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు.

పెట్రోల్ బంక్ ఆవరణలో మంటలు చెలరేగడంతో అక్కడ భయాందోళన నెలకొంది. అయితే, బంక్ మేనేజర్ తో పాటు ఇతర సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక పరికరాలు, బోరు నీటిని ఉపయోగించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వారి సమయస్ఫూర్తితో మంటలు పెట్రోల్ నిల్వ చేసే ప్రధాన ట్యాంకులకు వ్యాపించకుండా అడ్డుకోగలిగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, తీవ్రంగా గాయపడిన వాహనదారుడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.


ఇందిరమ్మ కుటుంబ బీమా అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: సీఎస్ ఆదేశం

హైదరాబాద్, నవంబర్18: ఇందిరమ్మ కుటుంబ బీమా అమలుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో సీఎస్ సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ బీమా పథకాలన్నీ ఇందిరమ్మ బీమా గొడుగు కిందకు తీసుకొస్తున్నట్లు వివరించారు. నేతన్న, గౌడ, కార్మిక, మత్స్యకారుల రూ.2 లక్షల బీమాను రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు.

అర్హులైన ప్రతి కుటుంబ సభ్యుడికి ఈ బీమా భద్రత కల్పించాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు. కుటుంబంలోని సభ్యులందరూ నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ బీమా పథకంపై విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్లకు వివరించారు. దాదాపు నెల రోజుల పాటు ఈ నమోదు ప్రక్రియ కొనసాగనుందని అన్నారు. ఆన్‌లైన్ నమోదుకు ప్రత్యేక యాప్ రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. పారదర్శకంగా, సమర్థవంతంగా ఈ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు స్పష్టం చేశారు.

షీ జిన్‌పింగ్, పుతిన్‌లతో కీలక భేటీ కోసం చైనా చేరుకున్న డొనాల్డ్ ట్రంప్



న్యూ ఢిల్లీ, నవంబర్ 18:: చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లతో జరగనున్న చరిత్రాత్మక త్రైపాక్షిక చర్చల కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇవాళ చైనాలోని షెంజెన్ నగరానికి చేరుకున్నారు. ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార సదస్సులో పాల్గొనేందుకు విచ్చేసిన ట్రంప్‌కు, షెంజెన్ బావోన్ అంతరాజ్జీయ విమానాశ్రయంలో షీ జిన్‌పింగ్ స్వయంగా స్వాగతం పలికారు.

ట్రంప్, షీ జిన్‌పింగ్, పుతిన్‌ల మధ్య గురువారం అత్యంత కీలకమైన సమావేశం జరగనుంది. ఈ భేటీలో ప్రధానంగా ఇరాన్ యుద్ధం, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ప్రపంచ వ్యూహాత్మక స్థిరత్వంపై లోతైన చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ సమావేశం నుంచి తక్షణమే నిర్దిష్ట ఫలితాలు వస్తాయన్న అంచనాలు తక్కువగా ఉన్నప్పటికీ, ప్రపంచ శాంతికి కీలకమైన అంశాలపై ముగ్గురు అగ్రనేతలు చర్చిస్తారని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. మరోవైపు, 21 దేశాలు పాల్గొంటున్న ఈ ఎఫ్ఐఇ సదస్సుకు ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ కూడా హాజరయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

చైనా 'సిలికాన్ వ్యాలీ'గా పేరుగాంచిన షెంజెన్ వేదికగా జరుగుతున్న ఏపెక్ సదస్సును షీ జిన్‌పింగ్ ప్రారంభించారు. స్వేచ్ఛా వాణిజ్యం (ఈతీవవ బితీజీటవ), కృత్రిమ మేధస్సు (ంఏ) రంగంలో పరస్పర సహకారం, డిజిటల్ ఎకానమీ, తదితర సంబంధాలను బలోపేతం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

సదస్సులో ప్రసంగించిన రష్యా అధ్యక్షుడు పుతిన్.. తమ దేశంపై విధించిన ఆంక్షలు బెడిసికొట్టాయని, అవి రష్యాను మరింత బలోపేతం చేశాయని వ్యాఖ్యానించారు. ట్రంప్ రాకముందే బుధవారం ఉదయం షీ జిన్‌పింగ్, పుతిన్ విడిగా సమావేశమయ్యారు.

మనీలాలో మూడు రోజుల ఆసియా పర్యటన ప్రారంభించిన ట్రంప్, అక్కడ భారత్, జపాన్, ఆస్ట్రేలియా వంటి కీలక మిత్రదేశాల నేతలతో సమావేశమైన అనంతరం చైనాకు చేరుకున్నారు. సదస్సు సందర్భంగా షీ జిన్‌పింగ్ దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్, కెనడా ప్రధాని మార్క్ కార్నీ, వియత్నాం అధ్యక్షుడు తో లామ్‌లతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. వాణిజ్యం, కొరియా ద్వీపకల్పంలో శాంతి తదితర

చురక

సృజనాత్మక స్వేచ్ఛకు
శృంఖలాల వ్యవస్థ
ప్రగతిశీల భావజాల
ప్రజా కళల అవస్థ.
నిఘాకళ్ల సర్కారు
నియంత్రణ నీడలే
కనిపించక విస్తరించే
కఠిన జైలు గోడలే

-వేల్పుల నారాయణ
9440433475

అష్టావధానమ్ము
అవని కిడు మోదమ్ము
కొంగు బంగారమ్ము
అనును రాధశ్రీ !!
దివ్య రామాయణము
భవ్య పారాయణము
మది కొసగు సంతసము
అనును రాధశ్రీ !!

స్థానిక ఎన్నికలపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం.. కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు


అమరావతి, నవంబరు 18: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పంచాయతీ ఎన్నికలు, రెండో దశ పట్టణ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం నేతలు, కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన.. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. 2024 ఎన్నికల్లో కూటమికి వచ్చిన ఓట్ల శాతం కంటే ఇప్పుడు గణనీయంగా ఎక్కువ ఓట్లు సాధించాలని సూచించారు. స్థానిక ఎన్నికలు కూటమి బలాన్ని నిరూపించుకోవడానికి మంచి అవకాశమని పేర్కొన్నారు.





నేటినిజం
సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com

‘తెలంగాణ సినీ కవుల సింగిడి’ పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో జే.కే.భారవి, డా॥ సుద్దాల అశోక్ తేజ, డా॥ తిరునగరి శరత్ చంద్ర, నామోజు బాలాచారి, వారాల ఆనంద్, మౌనశ్రీ మల్లిక్, డా॥ బుర్ల చంద్రశేఖర్

హైదరాబాద్, నవంబర్ 18:సినీ సాహిత్య రచన ప్రక్రియ సులువైన ప్రక్రియ కాదని వక్తలు అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సాహిత్యవారం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ రచయిత డాక్టర్ తిరునగరి శరత్‌చంద్ర రచించిన తెలంగాణ **సినీ కవుల సింగిడి** పుస్తకావిష్కరణ సభ ఆదివారం తిలక్‌నగర్‌లో గల తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం జరిగింది.

తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రసిద్ధ సినీ రచయిత జేకే భారవి, ప్రముఖ కవి వారాల ఆనంద్, సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్, డాక్టర్ బూర్ల చంద్రశేఖర్, పాల్గొని సినిమా పాటల ప్రస్థానాన్ని వారు వివరించారు.


తెలుగు సినీ సాహిత్యం, పాటల రచనా సేవ చేసిన ప్రముఖుల కృషిని ఈ సందర్భంగా వక్తలు తమ ప్రసంగంలో కొనియాడారు. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ.. తెలంగాణలో దాశరథి, సి. నారాయణరెడ్డి వంటి అద్భుతమైన గీత రచయితలు పుట్టారని సినీ పరిశ్రమకు వారు అందించిన గీతాలు మరువలేనివని అన్నారు. రచయిత తిరునగరి శరత్‌చంద్ర కృషి కూడా ప్రశంసించదగ్గది అన్నారు.

గౌరవ అతిథి జెకె భారవి మాట్లాడుతూ.. తెలంగాణ నేల పోరాటాల జాడ అని ఇక్కడ పాటలు పుట్టుకతోనే వస్తాయని, తిరునగరి రచనను, సాహిత్య అకాడమీ ని అభినందించారు.

అనంతరం సినీ కవి మౌనశ్రీ మాట్లాడుతూ.. యువతరం సినిమా రంగంలోకి రావాలని ఒకటి రెండు సినిమాలకు పాటలు రాయడంతో ఆగిపోవద్దని, పెద్దల మార్గదర్శనంలో అద్భుతమైన విజయాలు సాధించాలని కోరుతూ రచయిత శరశ్చంద్రను అభినందించారు. సినీ విమర్శకుడు వారాల ఆనంద్ మాట్లాడుతూ.. కవిత్వం రాసేవారు సినిమా పాటలు రాసేవారు ఇరువురు గొప్పవారని ఒకరు తక్కువ ఒకరు ఎక్కువ కాదని అన్నారు. గ్రంథాన్ని నమోక్షిస్తూ డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ రచయిత పరిశోధన ఎంతో ఉందని, ఇది ఉత్తమ గ్రంథం అని అన్నారు. అకాడమీ కార్యదర్శి బాలాచారి అతిథులను ఘనంగా సత్కరించారు. రచయితలకు తెలంగాణ సాహిత్య అకాడమీ ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుందని అన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా మోహన కృష్ణ వ్యవహరించారు. తెలంగాణలోని వెంగీ, పూర్ణాచారి, బల్లెం వేణు, కావూరి శ్రీనివాస్, నాగరాజు కువ్వారపు, జీడిగుంట వెంకట్రావు, ఉడయవర్లు, అలరాజు, కోవూరి అనిల్ కుమార్, రుద్రంగి రమేష్, సూరి, పత్తిపాక వందమంది గీత రచయితలు కార్యక్రమంలో పాల్గొన్నారు. .దర్శకుడు నామాల రవీంద్ర నూరి వందన సమర్పణ చేశారు.



కాళోజీ కవితా వ్యక్తిత్వాన్ని దృశ్యీకరించిన కవితలు...



ప్రతులకు : డా॥తిరునగరి శ్రీనివాస్
9441464764

“అన్నపు రాసులు ఒకచోట ఆకలి మంటలు ఒకచోట హంస తూలిక లొకచోట అలసిన దేహాలొకచోట సంపదలన్నీ యొకచోట గంపెడు బలగం బొకచోట “అని నిర్భయంగా చెప్పిన కవి కాళోజీ నారాయణరావు. కాళోజీ ఎక్కడ ఉన్నా ఏం చేసినా ఆయన ప్రజల మనిషి .... ప్రజల గొడవే కాళోజీ గొడవ. ప్రముఖ కవి, విమర్శకులు డాక్టర్ తిరునగరి శ్రీనివాస్ సంపాదకత్వంలో 74 మంది కవుల కవితలతో ‘కవితాగ్ని గోళం కాళోజీ ‘ సంకలనం వెలువడింది. కవిగా, దార్శనిక పోరాటయోధునిగా కాళోజీ విశిష్టతను వెల్లడిస్తూ పలువురు కవులు ఇందులో కవితలను రాశారు. ఈ పుస్తకం పేరే ‘కవితాగ్ని గోళం కాళోజీ’ అనగానే పాఠకుడి నరనరాల్లో ఓ కొత్త ఉత్తేజం తెలియకుండానే వచ్చి చేరుతుంది.

కాళోజీ నారాయణరావు గురించి ఒక్కొక్క కవి తమ మనసులో ఉండే భావాలకు అక్షర రూపాన్ని ఇచ్చారు. నిజాం పరిపాలనకి వ్యతిరేకంగా అతను చేసిన పోరాటాలను కళ్ళకు కట్టినట్టుగా చూపించారు. మాటలతోనే మంటలు పుట్టించే నిత్య చలనశీలి కాళోజీ . తెలంగాణ యాసను తన శ్వాసగా చేసుకొని జీవితమంతా ప్రజల కోసమే త్యాగం చేసిన మహానుభావుడు కాళోజీ . కాళోజీ రచన అంటే ప్రజలకు నడుస్తున్న ఒక మేలుకొలుపు. కాళోజీ కలం నిండా అన్యాయం పై నిరసన ఎగిసిపడుతుందని, ప్రజలకు కష్టాల నుండి విముక్తి లభించాలని అతను కలమెత్తి చాటిన తీరు కవుల కవితలలో అభివ్యక్తమైంది.నిరంకుశ పాలనపై ఎగిసిన నిప్పుకణం కాళోజీ **“ఒక్క సిరా చొక్కా లక్ష మెదళ్లకు కదలిక”** అంటూ అక్షరం యొక్క విలువను, నిత్య కర్మయోగిగా జీవించిన తీరును కవులు తమ కవితలలో పేర్కొన్నారు.

తెలంగాణ యాస తన కవితకు ప్రాస అంటూ తన సాహిత్యానికి ఇదే అసలైన శ్వాస అంటూ అందరికీ అర్థమయ్యేలా తన రచనలను చివరి వరకు కొనసాగించిన కవిగా కాళోజీని ఈ సంకలనంలోని పలు కవితలు తెలిపాయి. సాహిత్య క్షేత్రంలో రగిలిన నిప్పు సెగలా వెలుగులు విరజిమ్మిన తీరును కవులు చెప్పారు. నేటి యువకులకు కాళోజీ రచనలు ఎంతగానో స్ఫూర్తినిస్తాయి అనడంలో సందేహం లేదు. **“పుట్టుక నీది చావు నీది బతుకుతా దేశానిది”** అని కాళోజీ చెప్పిన స్ఫూర్తి మంత కవిత వాక్యాలే ఇందుకు నిదర్శనం. న్యాయం కోసం తపించి అన్యాయాన్ని ధైర్యంగా ఎదిరించిన ఆయన ఆయన జన్మదినోత్సవం సెప్టెంబర్ 9వ తేదీన తెలంగాణ భాషా దినోత్సవంగా జరగడం ఆయనకు అర్పించే గొప్ప నివాళి అని పలువురు కవులు తమ కవితలలో పేర్కొన్నారు. దేశ అత్యున్నత ద్వితీయ పౌర పురస్కారం అయిన పద్మవిభూషణ్ ను అందుకున్న మహా మనీషి కాళోజీ . కాళోజీ పేరిట ఆయన జన్మదినోత్సవం సందర్భంగా పురస్కారాలను కుడా కవులకు ప్రభుత్వంతో పాటు పలు సంస్థలు అందిస్తు న్నాయి. **‘అన్నం అందరికీ దొరికే రోజు, అవకాశం అందరికీ లభించే రోజు మనిషిని మనిషిగా చూసే రోజు’...** అదే కాళోజీ కలలు కన్న సమ సమాజం.

పరాయి భాషగా తెలుగు కు ప్రాధాన్యత తగ్గిన తీరుకు కాళోజీ ఎంతో కలత చెందిన తీరును , పేదల పక్షపాతిగా నిరంతరం ప్రశ్నించిన వ్యక్తిత్వాన్ని కవులు తమ కవితలలో వివరించారు. తెలంగాణలో మహోజ్వల కవిత శక్తిగా కాళోజీని కవులు పేర్కొన్నారు. దురంతాలకు, అసమానతలకు ఎదురు నిలిచి పోరాడిన నిలువెత్తు ఉద్యమ శిఖరం కాళోజీ. వేషం కంటే భాష ముఖ్యమంటూ మాండలిక భాష ప్రాధాన్యతను ప్రపంచానికి చాటి చెప్పారు. **‘ఓరుగల్లు పోరు బిడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ’** కాళోజీ కలం ఆయన చేతిలో అలంకరణ కాదు, అది అన్యాయాన్ని ప్రశ్నించే గొప్ప ఆయుధం, అది అణగారిన మనిషికి అండగా నిలిచే భాస్వరం, అది అణచివేతల మధ్య మౌనంగా కూరుకుపోయిన సమాజాన్ని మేల్కొలిపే మేల్కొలుపు అని కవులు తమ కవితలలో అభిప్రాయపడ్డారు. కాళోజీని కవిగానే కాకుండా ఒక పోరాట భూమికగా కవుల కవితలు పేర్కొన్నాయి. గొంతులో పోరాట నినాదం పలికిస్తూ గుండెలో అన్యాయాన్ని తరిమేసే ధీరత్వం గల పోరాట కవిగా ఈ కవితల ద్వారా కాళోజీకి కవిత నివాళిని కవులు అర్పించారు. పేదవాడి కన్నీళ్లు, ఆకలి ఆక్రందన లోంచి పుట్టిన కాళోజీ కవిత్వాన్ని ప్రజా కవిత్వం గా కవులు కవితలలో తెలిపారు.

‘పదవుల కోసం కాదు ఆయన కలం ప్రజల కోసంనడిచింది,పురస్కారాల కోసం కాదు ఆయన గళం ప్రజాస్వామ్యం కోసం గర్జించింది’ అని కాళోజీని తమ కవితలలో చెప్పారు. నిర్భీతి లేని కవిగా ఆయనను చూపారు. కాలం మారినా సమాజం మారినా కాళోజీ నందించిన ప్రశ్నలు నిత్యం ఎదురవుతూనే ఉంటాయని కవులు వెల్లడించారు. అన్యాయాన్ని ఎదిరించే ప్రతి మనిషిలో నిజాన్ని పలికే ప్రతి గొంతులో కాళోజీ మళ్లీమళ్లీ పుడుతూనే ఉంటాడని పలు కవితల్లో కవులు పేర్కొన్నారు . **‘మాటల్లో నూటితనం మనసుల్లో మానవత్వం తెలంగాణ మట్టికి గర్వకారణం’** కాళోజీ పేరు ఎప్పటికీ చిరస్మరణీయం అన్న కవితాక్షర నివాళిని ఈ కవితలు అందించాయి. సామాన్యుడికి కూటి, గూటి సమస్య తీరాలని బలంగా గళం వినిపించిన ప్రజాకవిగా , ప్రజల నాలుకల మీద నడయాడిన ప్రజాకవి తన తుది శ్వాస వరకు అవిచ్ఛిన్నంగా కవితా స్వరం కొనసాగించిన కవితా తపస్వీగా ,తెలంగాణ సాహిత్యపు సిరిగా కాళోజీని గురించి కవులు తమ కవితలలో చెప్పారు. ఇందులోని కవితలను కాళోజీ కవితాభిమానాన్ని, వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తూ కవులు రాశారు. ప్రతి కవిత చదువుతున్నంత సేపు గుండెల్లో ఎన్నెన్నో ప్రశ్నలు, అప్పటి చరిత్ర, అన్యాయం దృశ్యమానంగా కళ్ళ ముందు కదలాడుతుంది. నేటి తరం కాళోజీని, ఆయన కవిత్వ తత్వాన్ని, ఆలోచనల సారాన్ని గురించి తెలుసుకునేందుకు తోడ్పడే కవుల కవితల కదంబం ఈ సంకలన ప్రయత్నం. ప్రతి ఒక్కరు చదవాల్సిన పుస్తకం ఇది



-రామ్ లలితారెడ్డి
9704699726

దేశానికి పట్టాభి అందించిన సేవలు మరువలేనివి

-తెలుగు వర్సిటీ వీసీ నిత్యానందరావు



సభలో ప్రసంగిస్తున్న ఆచార్య వెలుదండ నిత్యానందరావు. వేదికపై డా॥ మక్కెన శ్రీను, పి. బ్రాహ్మజీరావు, ఓలేటి పార్వతీశం

హైదరాబాద్, నవంబర్ 18: దేశానికి ఆంధ్రా బ్యాంక్ వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య అందించిన సేవలు మరువలేమని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం ఉపకులపతి వెలుదండ నిత్యానందరావు అన్నారు. గుంటూరులోని బ్రాడీపేట పెన్షనర్ల భవనంలో శనివారం డాక్టర్ పట్టాభి కళా పీఠం 16వ వార్షికోత్సవ, పట్టాభి అవార్డుల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. కళాపీఠం వ్యవస్థాపకులు తూములూరి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఉపకులపతి నిత్యానందరావు మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదని అన్నారు. భాషా సేవకు అంకితమైన వారిని మనం మరచిపోరాదని పేర్కొ మాధ్యమం త్వరితగతిన అభి వృద్ధి చెందుతున్నారు. ఈ క్రమంలో విశ్వ విద్యాలయంలో ఏటా ప్రతిభామూర్తులకు కీర్తి పుస్తక పఠనం చేయాల్సి ందేనని చెప్పారు.



బైస దేవదాసుకు ప్రతిభా పురస్కార ప్రదానం చేస్తున్న పి. బ్రహ్మాజీరావు, డా॥ఓలేటి పార్వతీశం, మక్కెన శ్రీను, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, తూములూరి రాజేంద్రప్రసాద్.

స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర బ్యాంకు వ్యవస్థాపకులు, జర్నలిస్టు అయిన భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరున ప్రతిభా పురస్కారం అందు కున్నందుకు ఎంతో గర్వంగా వుందని నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు తన స్పందనలో తెలిపారు.

పంచుమర్తి సత్యనారాయణ రచించిన పరశురామేశ్వర స్వామి సమగ్ర చరిత్ర పుస్తకాన్ని నిత్యానందరావు, తూములూరి రాజేంద్రప్రసాద్ రచించిన గురువిశ్వస్ఫూర్తి వారి రచనలు సమాలేచన పుస్తకాన్ని వోలేటి పార్వతీశం, మక్కెన శ్రీను రచించిన శిథిల సాక్ష్యాలు పుస్తకాన్ని బ్రాహ్మజీరావు పురస్కారాలు ప్రదానం చేస్తున్నామని గుర్తు చేశారు. దూరదర్శన్ విశ్రాంత అధి కారి వోలేటి పార్వతీశం మాట్లాడుతూ కవి, రచయిత సామాజిక అంశాలపై దృష్టి సారించాలని అన్నారు.



ఓలేటి పార్వతీశంకు ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తున్న పి. బ్రహ్మాజీరావు, మక్కెన శ్రీను, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, తూములూరి రాజేంద్రప్రసాద్.

నిరంతరం రచనలు చేస్తూ సమాజాన్ని చైతన్య పరుస్తూనే ఉండాలన్నారు. ఏఎన్‌యూ పర్యావరణ విభాగాధిపతి పి. బ్రాహ్మజీరావు మాట్లాడుతూ ప్రకృతిని రక్షిం చుకుని పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గన్నవరం పశువైద్య కళాశాల వైద్యులు మక్కెన శ్రీను మాట్లా డుతూ డిజిటల్ ఆవిష్కరించారు. వెలుదండ నిత్యానందరావు (జీవిత సాఫల్య పురస్కారం), వోలేటి పార్వతీశం (మీడియా). బైస దేవదాసు (పత్రికా రంగం),అద్దంకి శ్రీనివాసరావు (రంగస్థలం), బీవీ శివకుమారి (స్త్రీశక్తి), టీజే రాజేంద్రప్రసాద్ (విద్య), పంచుమర్తి సత్యనారాయణ (చరిత్ర-పరిశోధన), ఎం.ముత్తారావు (పశువైద్యం), పి.బ్రహ్మాజీరావు (పర్యావరణం), వడలి రాధాకృష్ణ (సాహిత్యం), మన్నె అనూరాధ, ఎం. శ్రీనివాస రావు, అమరనేని వెంకటేశ్వర్లు, గింజుపల్లి సుధాకర్, మక్కెన జవ హర్ రాణీలకు ప్రతిభా పురస్కారాలు అందించారు.



పొత్తూరి సుబ్బారావుకు ప్రతిభామూర్తి సత్కారం గావిస్తున్న పి. బ్రహ్మాజీరావు, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, మక్కెన శ్రీను, తూములూరి రాజేంద్రప్రసాద్.

స్టెతస్కోపు మెడలో పూలదండ

ఆమె హృదయం పువ్వై పూసింది
ఒక్క చిన్న కత్తి గాటు వల్ల
చెమటలు ఆవిరైపోయి
దేహాన్ని వెచ్చబరిచినై
గొంతు నొప్పి అమాంతం ఎగిరిపోయి
కృతజ్ఞతగా మూలిగింది
శ్వాస బరువు తగ్గి బతుకు
ఊపిరి తీసుకుంది.
హార్ట్ ను ఎవరు ఎటాక్ చేసారో
కనిపెట్ట లేని దాన్ని
కనిపెట్టిన చేతికి దండాలు
అంజియో గ్రాం,
బేలూన్ కరోనరీ,
సర్జరీ, స్టంటు పరిభాష ఏదైనా
మనిషికి ప్రాణదానాలు
వేదాంతం అని కాదు గనీ
‘ఎవరేం కట్టుకు పోతం‘ అంటం
స్టెతస్కోపుకు ఏ కులము, మతము అంటదు
లాభ నష్టాల తులాదండం తూచదు
కరినత్వం చూపుతూనే
కారుణ్య జ్యోతులు వెలిగించ గలదు.
మనమేం చేసినా మన శరీరం
భరిస్తదనుకుంటం
తిరగబడితే
ధవళ దుస్తుల ప్రాణదాతకు
మోకరిల్లక తప్పదు
ప్రశాంత వదనంతో,
ప్రశాంతత వొంపే తత్వం నింపాదిగా,
చెదరిన జీవం కుదుళ్ళను
పాదు కట్టే మహత్వం
సామాన్యుడికైనా కుబేరుడికైనా ఆ హస్తవాసి
ఎప్పుడో ఒకప్పుడు అనుభవించక కాలం నడవదు.
ఆసుపత్రిని, వైద్యున్ని తిట్టుకుంటం
మనసులోనూ పెట్టుకుంటం



-దాసరాజు రామారావు
సెల్:9618224503

కవిత్వం రాస్తే వచ్చేది కాదు.. వస్తే రాసేది

-బైస దేవదాసు



’ఓ ప్రేమ కథ’ నవల ఆవిష్కరణలో జి. పద్మావతి, ఎన్వీ రఘువీర్ ప్రతాప్, పొత్తూరి సుబ్బారావు, ఆచార్య టీ. గౌరీశంకర్, హైమవతి భీమన్న, ఆవిష్కర్త బైస దేవదాసు, రచయిత్రి ఎస్. విజయలక్ష్మి, పులివర్తి కృష్ణమూర్తి, పెద్దూరి వెంకటదాసు, ఎస్. మధుకర్. ఎస్. సుశీల్ కుమార్, జి. గీత.

హైదరాబాద్, నవంబర్ 18: కవిత్వం రాస్తే వచ్చేది కాదని, వస్తేనే రాసేది అని నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు అన్నారు.

అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్, విశ్వసాహితీ ఆధ్వర్యంలో సోమవారం అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్ నూతన భవనంలో రచయిత్రి ఎస్. విజయలక్ష్మి రచించిన **‘ఓ ప్రేమ కథా చిత్రం’** నవలను ఆవిష్కరిస్తూ బైస దేవదాసు మాట్లాడుతూ.. నలభై ఏళ్ళుగా విజయ్‌లక్ష్మి రచనలు చేస్తున్నారని కీ॥శే॥ పోతుకూచి సాంబశివరావు గారి ఆశీస్సులతో సాహిత్యంలో ఎదిగారని అన్నారు. ప్రేమ గొప్పతనం గురించి ఈ నవలలో వివరించారని తన మనసులోని భావాలను చక్కగా వ్యక్తపరిచారని అన్నారు. అధ్యక్షత వహించిన ఆచార్య కదారు సత్యమూర్తి మాట్లాడుతూ.. ఆవిష్కృత రచనలు పాఠకులను ఆసక్తిగా చదివిస్తాయన్నారు. **‘ప్రసన్నకు అక్షరాంజలి’** పుస్తకాన్ని ఆవిష్కరించిన తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి. గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రసన్నకు అక్షరాంజలి కవితా సంపుటిలోని కవిత్వాన్ని విశ్లేషించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ గాయని బోయి భీమన్న కళాపీఠం అధ్యక్షురాలు హైమవతి భీమన్న మాట్లాడుతూ.. రచయిత్రి విజయలక్ష్మి తన శిష్యురాలని ఆమె విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి కవిత్వాలు రాసేదని గుర్తు చేశారు. కవులు సభలకు రావాలి కవి త్వాలను చదవాలన్నారు. ప్రముఖ కవి పెద్దూరి వెంకటదాసు నిర్వహణలో పలువురు కవులు కవితా పఠనం చేశారు. పొత్తూరి సుబ్బారావు, పులివర్తి కృష్ణమూర్తి, గోళ్లమూడి పద్మావతి, జర్నలిస్ట్ యశోద పాల్గొన్నారు.



“ప్రసన్నకు అక్షరాంజలి” పుస్తకావిష్కరణలో ఆవిష్కర్త ఆచార్య టీ. గౌరీశంకర్, కవయిత్రి ఎస్. విజయలక్ష్మి, హైమావతి భీమన్న, ఆచార్య కదారు సత్యమూర్తి, బైస దేవదాసు, పులివర్తి కృష్ణమూర్తి, పెద్దూరి వెంకటదాసు.

నవంబర్ 21వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ ప్రెస్ అకాడమిలో

లీలావతీదేవి శతజయంతోత్సవం - విశిష్ట ప్రతిభామూర్తులకు సత్కారం

అక్షరాలను ఆయుధాలుగా, సాహిత్యాన్ని సామాజిక చైతన్యానికి సాధనంగా మలచుకున్న మహిళా సాహితీ శక్తి 'అక్షరయాన్'. ప్రముఖ కవయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మి గారి సారథ్యంలో దాదాపు 1,700 మంది రచయిత్రులతో విశిష్ట సాహిత్యోద్యమంగా ఎదిగింది.

మహిళా సాధికారత, బాలల రక్షణ, దేశభక్తి, సాంస్కృతిక పరిరక్షణ వంటి అనేక అంశాలపై **'పని ముెలకలు-రుధిర జ్వాలలు', 'ఉద్యమిక', 'సలాం సైనికా', 'సముజ్వల భారతి', 'పూలసిం గిడి', 'మహాలక్ష్మి'** వంటి విలువైన సంకలనాలను వెలువరించింది. 750 మంది రచయిత్రుల వివరాలతో డైరెక్టరీ రూపొందించడం, విస్మృత రచయిత్రుల సాహిత్య సేవలను వెలుగులోకి తీసుకురావడం మా సంస్థ విశిష్ట కృషికి నిదర్శనాలు.

'వంపకవి' జాతీయ పురస్కారాలు, 'మాతృ వందనం', 'వార సత్వ దీప్తులు', 'అక్షరయాన్ అవార్డులు' వంటి కార్యక్రమాలతో సాహితీవేత్తలను గౌరవిస్తోంది. రాష్ట్రపతి నిలయంలో ఎనిమిది భాషల్లో కవిసమ్మేళనం నిర్వహించి తన ప్రత్యేకతను చాటుకుంది.

అయినంపూడి శ్రీలక్ష్మిగారి దార్శనిక నాయకత్వంలో గతతరం సాహిత్య వారసత్వాన్ని పరిరక్షిస్తూ, వర్తమాన రచయిత్రులను ప్రోత్సహిస్తూ, భావితరాలకు స్ఫూర్తినందిస్తున్న అక్షరయాన్ తెలుగు సాహిత్య లోకానికి గర్వకారణం. వేల కలాలు ఒక్కటైతే సమాజ పరివర్తనకు బాటలు వేస్తాయన దానికి సజీవ సాక్ష్యం అక్షరయాన్.

నవంబర్ 21వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ ప్రెస్ అకాడమిలో అక్షరయాన్, అభిజ్ఞ భారత్ కోడూరి లీలావతి దేవి - పద్మిని మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అద్భుతమైన కార్యక్రమం జరుగుతోంది.

సాహిత్యం, సంగీతం, సామాజిక సేవ. ఈ మూడు రంగాల్లోనూ తనదైన ముద్ర వేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి కోడూరి లీలావతి దేవి. అక్షర సృజనతో పాటు సామాజిక చైతన్యానికి విశేష ప్రాధాన్యమిచ్చిన ఆమెకు శతజయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నాము.

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో జన్మించిన కోడూరి లీలావతి దేవి చిన్ననాటి నుంచే సంగీత సాహిత్యాలపై అభిరుచిని పెంచుకున్నారు.

జాతీయోద్యమ స్ఫూర్తిని అందిపుచ్చుకున్న ఆమె రచయిత్రిగా, సంగీత విదుషీమణిగా, సామాజిక సేవాభిలాషిగా బహుముఖ ప్రతిభను చాటుకున్నారు. ఆమె సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ శతజయం త్యుత్సవంలో ఆమె రాసిన చారిత్రక నవల 'జయవిపంచి' ఆవిష్కరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ గారు ముఖ్య అతిథిగా హాజరవుతారు.

నారవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా. వెలుదండి నిత్యానందరావు గారు విశిష్ట అతిథిగా పాల్గొని నవలను ఆవిష్కరిస్తారు. 'నేటి నిజం' పత్రిక సంపాదకులు బైస దేవదాస్ గారు గౌరవ అతిథిగా, అరుణోదయ విమలక్క ఆత్మీయ అతిథిగా పాల్గొంటారు. డా. మామిడి హరికృష్ణ గారు సభాధ్యక్షత వహిస్తారు.



కోడూరి లీలావతి దేవి శతజయం త్యుత్సవంలో భాగంగా ఐదు విభిన్న రంగాల్లో విశేష కృషి చేసిన మహిళలను 'కోడూరి లీలావతి దేవి విశిష్ట మహిళా పుర స్కారాల'తో సత్కారం జరుగు తుంది.

వైద్య రంగంలో డా. చిరంజీవి, సామాజిక సేవా రంగంలో డా. మమతా రఘువీర్, ఆధ్యాత్మిక రంగంలో డా. నాగేశ్వరి, సాహిత్య రంగంలో చివుకుల శ్రీలక్ష్మి, సంగీత రంగంలో శ్రీమతి సుబ్బలక్ష్మి కట్టమూరి ఈ పురస్కారాలను అందుకుంటారు.

విభిన్న రంగాల్లో మహిళలు సాధిస్తున్న విజయాలను గుర్తించి గౌరవించడం, వారి సేవలను సమాజానికి పరిచయం చేయడం, తద్వారా మరెందరో మహిళలకు స్ఫూర్తినందించడం ఈ పురస్కారాల ప్రధాన ఉద్దేశం.

అంతేకాకుండా నేటి బాలలే రేపటి సృజనకారులు అన్న భావనతో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న తొమ్మిది మంది బాలబాలికలకు పురస్కారాలు అందిస్తున్నాము. దీనిని మా అక్షరయాన్ బాల బాలికల విభాగ అధిపతి శ్రీమతి ఘాలి లలిత ప్రవల్లిక గారు నిర్వహిస్తారు.

వాద్య సంగీతం, గ్రాఫ్లింగ్, నటన, వ్యాఖ్యానం, చిత్రలేఖనం, పద్య రచన, కథారచన, పద్య ధారణ వంటి విభాగాల్లో బాలల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నాము. చిన్నారుల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీసి, వారి ప్రతిభకు సముచిత గుర్తింపునివ్వడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. బాల్యంలో లభించే ప్రోత్సాహం భవిష్యత్తులో గొప్ప విజయాలకు పునాది అవుతుందనే నమ్మకంతో ఈ పురస్కారాలు అందిస్తున్నాము.

తన గళంతో వెయ్యి కథలకు జీవం పోసిన ప్రముఖ గళకారులు వెంపటి కామేశ్వరరావు గారికి ప్రత్యేక సత్కారం జరుగుతుంది. ఇంకా మహిళా కవి సమ్మేళనం, చివుకుల శ్రీలక్ష్మి గారి నవల 'మనిషి మట్టి మనుగడ' ఆవిష్కరణ వంటి కార్యక్రమాలు ఈ ఉత్సవానికి సాహిత్య శోభను చేకూర్చనున్నాయి.

గతతరం సాహిత్య వైభవానికి నీరాజనం అర్పిస్తూ, వర్తమాన మహిళా ప్రతిభను గౌరవిస్తూ, భావితరాల సృజనాత్మకతను ప్రోత్సహించే మూడు తరాల సాహిత్య సంగమం ఈ శతజయంత్యుత్సవం.

కాలం గడిచినా అక్షరాలకు వృద్ధాప్యం ఉండదు. తరాలు మారినా సృజనకు మరణం ఉండదు. సమాజానికి విలువైన సాహిత్య సంపదను అందించిన వ్యక్తుల జీవితం కాల గర్భంలో కలిసిపోదు. వారి రచనల ద్వారా నిరంతరం సజీవంగా నిలుస్తుంది.

అలాంటి అక్షరామ రత్వానికి ప్రతీకగా కోడూరి లీలావతి దేవి శతజయంత్యుత్సవం సాహిత్య ప్రపంచానికి ఒక స్ఫూర్తిదాయకమైన వేదుకగా నిలుస్తుంది.

-విశ్వైక
అక్షరయాన్
ప్రధాన కార్యదర్శి
9550183143



సంగీత సాహిత్య కళానిధి కోడూరి లీలావతి దేవి

సంగీత సాహిత్య రంగాల్లో సమాన ప్రతిభను చాటుకున్న అరుదైన బహు ముఖ ప్రజ్ఞాశాలి కోడూరి లీలావతి దేవి. రచయిత్రిగా, వీణా విదుషీమణిగా, సంపాదకురాలిగా, సామాజిక చైతన్యశీలిగా తెలుగు సాంస్కృతిక రంగంలో విశిష్టమైన స్థానం సంపాదించారు. దాదాపు 200 కథలు, అనేక నవలలు రచించిన ఆమెకు 'ఆశాకిరణం' నవల విశేషమైన గుర్తింపును తెచ్చిపెట్టింది. 'గృహ విజ్ఞానం', 'కుంకుమ రేఖ', 'బాల వినోదిని', 'ప్రగతి పథంలో ప్రమదలు' వంటి రచనలు ఆమె సాహిత్య వైవిధ్యానికి నిదర్శనాలు. 1968, 1969, 1970 సంవత్సరాల్లో వరుసగా మూడుసార్లు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారాలను అందుకోవడం ఆమె సాహిత్య ప్రస్థానంలో విశేషం. 'వీణా విశారద'గా మద్రాసు, విజయవాడ ఆకాశవాణి కేంద్రాల్లో గ్రేడ్-వన్ సంగీత విద్వాంసురాలిగా అనేక కచేరీలు నిర్వహించారు. 'ఉదయ రేఖ' వారపత్రికకు సంపాదకురాలిగా సేవలందించారు. అక్షరాల్లో భావగాంభీర్యాన్ని, వీణానాదంలో స్వరమాధుర్యాన్ని పండించిన కోడూరి లీలావతి దేవి తెలుగు సంగీత సాహిత్య రంగాలకు చిరస్మరణీయమైన కళామూర్తి ఆమె.

వైద్యరంగంలో స్ఫూర్తిదాయక శిఖరం - డా. చిరంజీవి



వైద్యసేవను వృత్తిగా మాత్రమే కాకుండా మానవీయ బాధ్యతగా భావిస్తూ నాలుగు దశాబ్దాలకు పైగా ఎముకలు, కీళ్ల వైద్యరంగంలో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ చిరంజీవి తాయి.

పురుషులు ఎక్కువగా ఉన్న ఆర్థోపెడిక్ వైద్యరంగంలో ఎన్నో సవాళ్లను అధిగమించి తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఉన్నత విద్యనభ్యసించిన ఆమె మోకాలి, తుంటి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో విశేష నైపుణ్యాన్ని సాధించారు. ఆధునిక రోబోటిక్ సాంకేతికతను అందిపుచ్చుకొని సంక్లిష్ట శస్త్రచికిత్సల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె అసాధారణ జీవిత ప్రస్థానాన్ని ఆవిష్కరిస్తూ డాక్టర్ రాహుల్ రచించిన 'బియాండ్ ది వైట్ కోట్' (Beyond the White Coat) స్ఫూర్తిదాయక జీవిత చరిత్రగా నిలుస్తుంది. బాల్యంలో అలవడిన క్రమశిక్షణ, పట్టుదల, కుటుంబ ప్రోత్సాహం, వృత్తిపట్ల అంకితభావం, కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన తీరు ఈ పుస్తకంలోని ప్రధానాంశాలు.

వైద్యరంగంలో మహిళగా ఎదురైన అనేక సవాళ్లను అవకాశాలుగా మలచుకొని, ఆధునిక వైద్య సాంకేతికతలో తన ప్రతిభను నిరూపించుకున్న ఆమె ప్రయాణం భావితరాల మహిళా వైద్యులకు ఆదర్శప్రాయం. వైద్యుని గొప్పతనం నైపుణ్యంగా శాస్త్ర చికిత్స చేయడంలోనే కాదు, రోగికి తిరిగి జీవితంపై ఆశను కలిగించడంలోనూ ఉందని నిరూపిస్తున్న డాక్టర్ చిరంజీవి తాయి వైద్యరంగంలో మహిళా సాధికారతకు, పట్టుదలకు, మానవీయ సేవకు నిలువెత్తు నిదర్శనం.

బాలల హక్కులకు రక్షణ కవచం - డా. మమతా రఘువీర్



మహిళలు, బాలల హక్కుల పరిరక్షణే జీవిత లక్ష్యంగా పాతికేళ్లకు పైగా విశిష్ట సేవలందిస్తున్న సామాజిక కార్యకర్త డా. మమతా రఘువీర్ ఆచంట.

బాల్య వివాహాల నిరోధం, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికల అక్రమ రవాణా నివారణ, మహిళా సాధికారత కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. 2000 సంవత్సరంలో స్థాపించిన 'తరుణి' స్వచ్ఛంద సంస్థ ద్వారా వేలాది మంది బాలికలకు విద్య, రక్షణ, పునరావాస అవకాశాలను కల్పించారు.

వరంగల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్‌గా, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలిగా విశిష్ట సేవలందించారు. పోక్సో (POCSO) చట్టం కింద లైంగిక వేధింపులకు గురైన చిన్నారులకు న్యాయం, రక్షణ అందించడంలో ఆమె కృషి ప్రత్యేకమైనది.

బాధిత చిన్నారులకు స్నేహపూర్వక వాతావరణంలో న్యాయసహాయం, వైద్యసేవలు, మానసిక కౌన్సెలింగ్ అందించే తెలంగాణ పోలీసుల 'భరోసా' కేంద్రాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు.

బాధిత చిన్నారులు నిందితులను నేరుగా చూడవలసిన పరిస్థితులను దాదాపు రాకుండా బాలల అనుకూల న్యాయప్రక్రియ కోసం కృషి చేశారు. 'తరుణి స్వావలంబన' కేంద్రం ద్వారా లైంగిక హింసకు గురైన బాలికలకు ఆశ్రయం, విద్య, ఉపాధి శిక్షణ అందిస్తూ వారి జీవితాల్లో కొత్త ఆశలను నింపుతున్నారు. బాధిత బాలలకు న్యాయం అందించడమే కాదు, వారి ఆత్మవిశ్వాసాన్ని పునర్నిర్మించి, గౌరవప్రదమైన భవిష్యత్తును అందించడమే ధ్యేయంగా సాగుతున్న డా. మమతా రఘువీర్ ఆచంట సామాజిక సేవకు స్ఫూర్తిదాయకమైన ప్రతీక.

అక్షర సృజనలో అపూర్వ ప్రతిభ - చివుకుల శ్రీలక్ష్మి



సాహిత్యాన్ని సామాజిక చైతన్యానికి సాధనంగా, విద్యను వ్యక్తిత్వ వికాసానికి పునాదిగా మలచుకున్న విశిష్ట రచయిత్రి, విద్యావేత్త చివుకుల శ్రీలక్ష్మి. సాలూరులో జన్మించిన ఆమె సాహిత్యం, విద్య, సమాజసేవ రంగాల్లో తనదైన ముద్ర వేశారు. 24 సంవత్సరాలు ఉపాధ్యాయినిగా సేవలందించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పురస్కారాలు అందుకున్నారు. 1985 నుంచి కవిత్వం, కథలు, వ్యాసాలు, పరిశోధనలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు. 'శ్రీ రామాయణ కథా ప్రశ్నోత్తర మాలిక', 'విజయనగర వైభవానికి దిక్సూచి', 'ఆది నుండి అనంతం దాకా', 'మనిషి-మట్టి-మనుగడ' వంటి గ్రంథాలు ఆమె సాహిత్య వైవిధ్యానికి నిదర్శనాలు.

అక్షరయాన్, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం వంటి వివిధ సంఘాల్లో నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. మహాత్మా గాంధీ జాతీయ పురస్కారం, కందుకూరి వీరేశలింగం పంతులు పురస్కారం, గుర్రం జాషువా జాతీయ పురస్కారం సహా అనేక గౌరవాలు అందుకున్నారు. అక్షరాల్లో సంస్కృతిని, రచనల్లో సామాజిక స్పృహను, బోధనలో మానవీయ విలువలను ప్రతిష్ఠించిన చివుకుల శ్రీలక్ష్మి తెలుగు సాహిత్యరంగంలో సృజనశీలతకు, సేవానిరతికి ప్రతీక. వారి "మనిషి మట్టి మనుగడ" నవల కూడా ఇదే కార్యక్రమంలో ఆవిష్కరణ అవుతుంది.

వీణానాదంలో స్వరమాధుర్యం - శ్రీమతి సుబ్బలక్ష్మి కట్టమూరి




వీణానాదానికి స్వరసౌందర్యాన్ని, సంగీత సాధనకు సంప్రదాయ వైభవాన్ని జోడించిన విశిష్ట సంగీత విదుషీమణి శ్రీమతి కట్టమూరి సుబ్బలక్ష్మి. 1957 నవంబరులో సంగీత కుటుంబంలో జన్మించిన వీరు బాల్యం నుంచే అసాధారణ ప్రతిభను కనబరిచారు.

తల్లిదండ్రులు మేదూరి నరసింహారావు, సత్యజ్ఞాన ప్రసూనాంబల వద్ద వీణావాదనలో శిక్షణ పొందారు. పదేళ్ల వయసులోనే కచేరీలు ప్రారంభించి బాలమేధావిగా ప్రశంసలందుకున్నారు. 1973లో ఆమె వీణావాదనలోని స్వరమాధుర్యాన్ని, సౌకుమార్యాన్ని, క్లిష్ట రాగాలను అలవోకగా పలికించే నైపుణ్యాన్ని ది హిందూ పత్రికవారు ప్రత్యేక శీర్షికగా ప్రచురించారు.

1975లో ఆకాశవాణి బి-హై గ్రేడ్ వీణా కళాకారిణిగా నేరుగా ఎంపికయ్యారు. 1985 నుంచి 1988 వరకు పద్మభూషణ్ డా. శ్రీపాద పినాకపాణి గారి వద్ద ప్రత్యేక శిక్షణ పొంది సంగీత ప్రజ్ఞను మరింత పరిపుష్టం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా అనేక కచేరీలు నిర్వహించి సంగీత ప్రియుల మన్ననలు, పురస్కారాలు అందుకున్నారు. బాలమేధావిగా ప్రారంభమై, నిరంతర సాధనతో వీణావాదనలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న కట్టమూరి సుబ్బలక్ష్మి సత్యా నంద్ కర్ణాటక సంగీత సంప్రదాయానికి, కళాసాధనలో నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం.

వైద్యసేవలో మానవీయత.. ఆధ్యాత్మికతలో నవ్యత-డా.కొమ్మినేని నాగేశ్వరి



వైద్య నైపుణ్యానికి మానవీయతను, ఆధ్యాత్మిక చింతనకు సామాజిక బాధ్యతను జోడించి విశిష్ట సేవలందిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలి డా. కొమ్మినేని నాగేశ్వరరావు. ప్రముఖ ప్రసూతి, స్త్రీరోగ, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలిగా 27 సంవత్సరాలకు పైగా మహిళా ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎండీ పూర్తి చేసిన ఆమె, 1998లో హైదరాబాద్‌లో 'శ్రీ శ్వేత మల్టీస్పెషాలిటీ డే కేర్ సర్జికల్ క్లినిక్' స్థాపించారు. సంతాన సాఫల్య చికిత్సలతో పాటు వందలాది వైద్య శిబిరాల ద్వారా నిరుపేదలకు సేవలందిస్తున్నారు. 2010లో 'బెస్ట్ డాక్టర్ అవార్డు' అందుకున్నారు.

'స్ఫూర్తి కుటుంబం గ్లోబల్' ద్వారా సనాతన సంప్రదాయాలను సనూతన దృక్పథంతో ఆవిష్కరిస్తూ, భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలు, సేవాతత్పరతను ఆధునిక జీవన విధానంతో అనుసంధానించేందుకు కృషి చేస్తున్నారు. వైద్యసేవతో శారీరక ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక చైతన్యంతో మానసిక వికాసానికి కృషి చేస్తున్న డా. కొమ్మినేని నాగేశ్వరి గారు సేవకు, సంస్కృతికి సమన్వయ ప్రతీక.

తిరిగి వచ్చు ఆనందాల అల్లరి

నేల తల్లి గుండె కోత
మనం చెప్పరాని వినరాని గాధ.
చూడ లేని బడబానల బాధ
పచ్చని పంటలతో నవ్వే తల్లి
ఇప్పుడు లోతుగా నెర్రెలు బారి
విలవిల లాడుతూ వలవల ఏడుస్తుంది.
వానలు లహహహహా వానల్లేక వాగులు
వంకలు తిరుగుతు వయ్యారంగ
ముందుకు సాగక
పాటు చేయు మార్గం కనరాక.
భూతల్లి గుండె కోత అనుభవిస్తుంది
తనబిడ్డల కడుపు నింపాలని తపిస్తుంది
తల్లి తన గుండెనే పంటగా పండించి
ఆకలితీరుస్తుంది.
కానీ మనం మరిచి తల్లి గుండె తొలిచి
తల్లి రుణం తీర్చుకోవడం అటుంచి
బాధల గంధమద్దుతున్నా మద్ధుతంగ
తరువులు సరికి బరువును పెంచి
భూజల ధారల నిర్ధయగ వంచించి.
ఈ తల్లి గుండె ముక్కలు చేస్తున్నాం
అయినా తల్లి తిట్టదు
బిడ్డలు బాగుండాలని దీవిస్తుంది
నేలతల్లి గుండెకోత మానాలంటే.
ఒక్క మొక్క నాటితే చాలు
ఒక్క చుక్క నీరు కాపాడితే చాలు
తల్లి గుండెకు మళ్ళీ చిరునవ్వు వస్తుంది
సస్య శ్యామలం నిత్య వసంతం అవుతుంది
మనకానందాల పందిరి వేస్తుంది.

-విజయ కుమారి
9100634635

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న 'బుధవారం బాధ్యా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ
95021 56813



" చుక్కలే నిప్పు కణికలాయే "

నేలతల్లి హృదయంలో గాయాలైనాయి
నీటి చెమ్మలేక దాహం తీరుతలేదు
కన్నీళ్లు కాలుష్యపు వేడిలో ఆవిరైపోయాయి
కలతచెందే అవసరమే లేకుండా దుఃఖం ఉప్పొంగుతుంది.
నేలంతా నెర్రెలుబారి, కరువే నూతన వేదుకాయే
పచ్చని పంటపొలాలు లేక కొన ఊపిరితో ఉన్న
రాలిపోయే ఆకే దిక్కాయే
మొక్కలు నాటాలి.. ప్రకృతిని రక్షించాలి
అంటే విన్నారా.. ఇప్పుడు కన్నతల్లి ఎదకే కన్నాలు పడెను.
ధరణిలో భగభగ మండే అగ్నిగోళాలు నాట్యమాడుతున్నాయి
రాత్రుల్లో చుక్కలు నిప్పుకణికలై భూమికి చేరుతున్నాయి.
చల్లని హిమము చెదిరిపోయి అల్లకల్లోలం అవుతుంది
మనిషి మానవత్వం మరిచినకాడి నుంచి
మాయలే జరుగుతున్నాయి.
పృథ్వి పటాపంచలై ఎర్రని పెదవులు పగిలినట్లు
పుడమి కడుపులో జలమే లేక తల్లడిల్లినట్లు
అవని తనను ఆదుకోవాలని హెచ్చరికలు మాని
అడుగుతుంది మనకోసమే
నీ మనుగడ పురోగతికి పునాది తాననే గుర్తు చేస్తుంది.

-పడిగెల దేవిదాస్, నిర్మల్

అరణ్య రోదన

గుక్క పట్టి ఏడుస్తోంది నేలతల్లి
కన్నీరు తుడిచే నాధుడు లేడు
అయ్యో అని కనికరించే కరుణామయులు లేరా?
రకరకాల కారణాలతో ఒళ్లంతా గుంతలు!
అభివృద్ధి పేరిట భూమాత ఒళ్లంతా రక్తసిక్తం
ఓదార్చు లేపనం మాట దేవుడెరుగు
రోజు రోజుకు క్షీణిస్తున్న పుడమి తల్లి ఆరోగ్య పరిస్థితి
అనాధ లాగా ఆక్రందనలు మిన్నంటుతున్నాయి!
ఎరువులతో క్రిమిసంహారక మందులతో,
భూమి అంత అస్తవ్యస్తం అగమ్య గోచరం!
భూమాత రోదనలు పట్టించుకునే వారే లేరా?
అంతా స్వార్థం స్వార్థం స్వార్థం జగమంతా స్వార్థమయం!
నా ఇంటికి వస్తే ఏం తెస్తావ్?మీ ఇంటికి వస్తే ఏమిస్తావ్?
బేరసారాల బానిస బ్రతుకులు!
మనిషి మనిషిగా బ్రతకలేడా బ్రతుకనీయరా?బ్రతుకునీయరా?!
పుడమి తల్లికి తన బ్రతుకు తాను బ్రతికే అవకాశం లేదా?
మానవ కార్య కలా పాలకు బలికాక తప్పదా?.

-బలిజేపల్లి నాగరత్నం, హనుమకొండ

శాస్త్రాల రారాజు

గణితం లలితం
గణితం శుభం
వదులు భయం
కదిలిన జయం.

విశ్వమంతా గణితం
శూన్యమే ఆది సూత్రం
అంకెలు సంఖ్యలు
నాలుగు ప్రక్రియలు
శాస్త్రాలకు మూలం.

పొదుపును చూపును
ముదమును పెంచును
ఖర్చులు పెరిగితే
మదమును త్రుంచును.

బంధాలు కూడికలు
దూరాలు తీసివేతలు
మమకారాలు గుణకారాలు
వికారాలు భాగహారాలు.

జీవితమే గణిత సారం
జీవప్రయాణ సాకారం.

శ్రమనే గణితం
సోమరికి అగణితం.

లెక్కల తోనే బతుకు
లేకుంటె బతుకు చితుకు



-రేడియమ్
9291527757

నరం లేని నాలుక

అబద్దాలకు అవకాశం ఇస్తే..
నమ్మకం వమ్ము అవుతుంది !.

దొంగకు అవకాశం ఇస్తే?
ఇల్లు గుల్ల అవుతుంది !

దురాశకు అవకాశం ఇస్తే..
మనశ్శాంతి మాయమవుతుంది !

దుర్మార్గుడికి అవకాశం ఇస్తే..
జీవితం అతలాకుతలం అవుతుంది !

మనుషులను తొందరగా నమ్మకు

నమ్మినా నిర్లక్ష్యంగా ఉండకు !
నేడు వెన్నెముకలా నిలిచినోడే..
రేపు వెన్నుపోటు పొడవవచ్చు !

నరం లేని నాలుక నరుడిది..
ఎప్పుడైనా మాట మార్చొచ్చు సుమా !



-మధుపాళీ
9949700037

కయ్యమాడుతుండే.. బియ్యం..!

నిత్యావసర ధరలు నిత్యం పెరగగా
బియ్యం ధరలూ ప్రియమయ్యాయి
మూడు నెలలుగా సన్నగా పెరుగుతూ
సగటు జీవులకు తుకతుక మనిపించే..!.
డిమాండ్ కి తగ్గ సప్లయి లేకపోగా
తండులానికి గిరాకి పెరిగి పోయింది
బజారులో షాపులలో బియ్యం ధరలు
కయ్యమాడుతుండే సామాన్య ప్రజలతో..!.
ఎల్ నినో పెను భూతాన్ని చూపించి
వరి దిగుబడులు తగ్గుదల చూపించి
బియ్యం రేట్లును దండిగా పెంచినారు
దళారులు సొమ్ము చేసుకునేందుకు..!.
దారి మళ్లుతున్న రేషన్ బియ్యంలో
సన్న బియ్యాన్ని మిన్నగా కలుపుతూ
విక్రయిస్తుండే బియ్యం వ్యాపారులు
లక్షలు గడించే రాజకీయ ప్రముఖులు
మోసపోతున్నారు మధ్య తరగతి వాళ్లు..!.
నిత్యావసర వస్తువుల ధరవరలు
నింగిలోని సితారలు అవుతున్నా
చుక్కలను చూపిస్తున్నారు దళారులు
ప్రేక్షక పాత్రను పోషించే అధికారులు..!.
బియ్యం ధరలను పాలకులు తగ్గించాలి
నకిలీ బియ్యాన్ని తనిఖీలో అరికట్టాలి
నాణ్యమైన బియ్యంని విక్రయించాలి
సామాన్య ప్రజలను సంతృప్తి పరచాలి..!



-జి.సూర్యనారాయణ,
6281725659.

రంగుల లేపనం

ఉదయాన్నే తోటలో అడుగుపెట్టాను
పూలకున్న రంగులన్నీ మాయం
అర్థంకాక ఆకాశంవైపు చూశాను
కాలుష్యంతో కాలిపోతున్న ఇంద్రధనస్సు
పూలరంగుల్ని లేపనంగా రాసుకుంటూ



-దా. కె.జి. వేణు
9848070084



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో దా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. ఈ వారం వచన కవితల వర్క్ షాప్...అంశం "పిల్లలు". విజేతల కవితలు చదవండి.

-దా॥రావి రంగారావు
9247581825


-సంపాదకులు

రేపటి వెలుగులు

పిల్లలు పూలు కాదు,
పూలకంటే మృదువైనవారు....
పూలు వాడిపోతాయి, పిల్లలు వికసిస్తారు!
పిల్లలు సీతాకోకచిలుకలు కాదు...
వాటికంటే చంచలులు,
సీతాకోకచిలుక ఒక పూవు మీద వాలుతుంది,...
పిల్లలు ప్రతి మనసు మీదా వాలుతారు!
పిల్లలు చందమామ కాదు,
చందమామ కంటే వెన్నెలవారు....
చందమామకు మచ్చ ఉంటుంది,...
పిల్లల మనసుకు మచ్చే ఉండదు!
పిల్లలు నదులు కాదు,
నదులకంటే స్వచ్ఛమైనవారు...
నదిలో బురద కలుస్తుంది,...
పిల్లల నవ్వులో కల్మషమే ఉండదు!
పిల్లలు అద్దం కాదు,
అద్దం కంటే నిజమైనవారు....
అద్దం ముఖాన్ని చూపుతుంది,..
పిల్లలు మనసును చూపుతారు!
పిల్లలు దేవుని ప్రతిరూపం కాదు,...
దేవుడే పిల్లల రూపంలో వచ్చాడు....
అందుకే పిల్లలు నవ్వితే ఇల్లే గుడి అవుతుంది...
పిల్లలు ఏడిస్తే గుండెలే కరిగిపోతాయి!
పిల్లలను పెంచడం అంటే
మొక్కను పెంచడం కాదు....
మనిషిని మలచడం,
రేపటి వెలుగును నేడే వెలిగించడం!!!

-ఆళ్ళ నాగేశ్వరరావు
7416638823

మువ్వల మధురనాదం 'సింజి'



ప్రతులకు: సా శ్రీ 501, సీతా రెసిడెన్సీ, బ్రాహ్మణవాడి, బేగంపేట్, హైదరాబాద్-16



ముద్దుకు ఉన్న అనేక పేర్లలో, సిం జిని అనేది ఒకటి. ఆ సింజినీలు లేదా మువ్వలు చేసే నాదాన్ని 'సింజి' అం టారు. రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, తెలుగు లో సొగసైన పదాలు, వాటి అందం గజల్ వాగ్గేయ కారిణిగా, సృజించిగానం చేయగల కవయిత్రి. తెలుగు పలు కులలో ఉన్న సౌందర్యాన్ని అన్వేషించి, నేలరాలిన మధుర పద పుష్పాలను ఏరుతూ, ప్రోదిచేస్తూ కవయిత్రి గజళ్ళ కవితా గానం వినిపిస్తారు. అపూర్వమైన కాఫియా రదీఫ్‌లతో సాగే అపురూప శైలీ విన్యాసంతో తెలుగు గజళ్ళకు సింజి నాదం ధ్వనింప చేసారు. 50 శీర్షిలలో సుమారు 250పైగా గజళ్ళ 50 పుటలలో, మాధవ్ అందించిన చిత్ర రూప కల్పనతో రసజ్ఞ హృదయాలను అలరిస్తున్నాయి. 'మల్లీ!' అంటూ ప్రతీ పుటలో కవయిత్రి మల్లియల సుగంధ, సుమనోహర సింగారాలతో హృద యాన్ని స్పృశిస్తారు. మల్లీ! వలపంటే విలసనమా ఓవలేని విలయమా కాదు కాదులె విషాదమని ఇపుడిపుడే తెలుస్తోంది అంటారు. ఈ గజళ్ళలో విరహాల ఊయల ఊపు, ఎదముంగిట వెన్నెల వాన, వయసు తెమ్మెరవలపు, వాసంత వసంతం కాని మనసు, పదాల పారాణి తళుకు చూపులు, కనురెప్పల విసన కర్రలు, నాగులున్న మొగలి పొద, ఏకాకి పక్కిరొద, అడవి పూలల కౌగిళ్ళు, పొడవల పడవల పండు వెన్నెల పరిచే పరవశాలు పూల పరిమళ, వెన్నెల సౌందర్య సింగార భావనలను అద్భుతంగా ఒలి కింప చేస్తారు. ఐదు గజళ్ళ సంపు టాలతో, సాహితీ సౌందర్యాభిషేకం చేసిన శ్రీమతి రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, గజల్ కవన వనంలో విలక్షణ కవయిత్రిగా, తెలుగుపద, భావ ప్రయో గాలతో గజల్ ప్రక్రియ సింజి నాద మాధుర్యంతో తన్మ యింప చేయటం కారణంగా, ఆమె అనూహ్య, అనన్య సామాన్య కవయి త్రిగా, తెలుగు కవిత్వాన్ని వినూత్న రీతిలో ప్రభావితం చేస్తున్నారు.



-జయసూర్య
సెల్:9440664610

కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

-సంపాదకులు

ఆ క్షణం

నీ చిరునవ్వు చూసిన క్షణం
నా గుండె కొట్టుకోవడం మరిచిన క్షణం
ఆ చిరునవ్వులోనే నా కల దాగి ఉన్నదని
తెలిసిన క్షణం
ఆ కలలోనే నీతో నా జీవితం ఉంది అని
తెలిసిన క్షణం మరువలేను చెలి..
ప్రతి ఉదయం నీ తలపుతోనే మొదలు
నువ్వు లేకుంటే ఆ ఉదయం
చీకటనే నా దిగులు
కారారాక ఎందుకు గుండె గుబులు.
నీ కలలలో నేనున్నాననే ఆశ
నా కలలలో నువ్వే ఉన్నావనే శ్వాస
ఆశతోనే ఎదురుచూస్తున్నా
నువ్వు ఒక్క మాట చెబుతావని విశ్వాస
నీ ఆశ నేనైతే చాలు అని
అత్యాశ నన్ను
నిలవనీయులకున్నది సఖి
చిరునవ్వుతో దోచావు
కలలోకి లాగావు
ఉదయం అంతా నీ ధ్యాసలోనే

-0సంధ్య జంగాల
92469 22626

"ఏ మతమైనా మానవత్వంతో పరిమళించాలి

మతం అంటే ఏమిటి?ఆత్మను తట్టి లేపే దివ్య మంత్రం
మానవత్వం అంటే ఏమిటి?ఆ మంత్రంలోని పరమార్థం..
మతమనేది..మనిషి మనసుకు వేసే వెలుగు బాట
మానవత్వమనేది ఆ బాటలో విరిసే కరుణ తోట..
దేవాలయ గంటలో భక్తి స్వరం వినిపిస్తుంది
ఆర్తజనుల గుండెలో దైవ స్వరం ప్రతిధ్వనిస్తుంది..
చర్చిలో ప్రార్థన చేస్తే..శాంతి దొరుకుతుంది
ఆకలితో ఉన్నవాడికి అన్నం పెడితే..
మనకు మనశ్శాంతి లభిస్తుంది..
మసీదులో అజాన్ వింటే.. అల్లా గుర్తొస్తాడు
కష్టంలో ఉన్నవాడిని ఆదుకుంటే..అల్లా ఎదురొస్తాడు..
మతం మనకు నేర్పింది దేవుడిని పూజించమని
మానవత్వం మనకు నేర్పింది మనిషిని ప్రేమించమని,..
మత గ్రంథాలు చదివితే.. జ్ఞానం వస్తుంది
మనిషి కన్నీరు తుడిస్తే.. మోక్షం వస్తుంది..
కులం చూసి మనిషిని దూరం పెడితే అది మతం కాదు
గుణం చూసి మనిషిని దగ్గరకు తీస్తే అదే మానవత్వం..
రక్తం అందరిదీ ఎర్రగానే ఉంటుంది
కన్నీరు అందరిదీ ఉప్పగానే ఉంటుంది
మరి మతం పేరుతో మనుషులను విడదీయడం ఎందుకు..
దేవుడు ఒక్కడే పేర్లు మాత్రమే వేరు
మనిషి ఒక్కడే మతాలు మాత్రమే వేరు..
మతాన్ని మదిలో ఉంచుకుందాం
మానవత్వాన్ని ప్రపంచానికి పంచుదాం..

-ఆత్మ న్యూనతా ఊబిలో..!!.
నయవంచకుల చేష్టలను తేటతెల్లం చేసే
విజ్ఞాన దీపాలు వెలిగించాలి చిరు మెదళ్లలో
ఏ కాముకుల దృష్టి సోకని ధైర్యపు కవచాలు
కావాలి చిన్నారుల యూనిఫామ్!!
అంతర్జాల ఆకర్షణలకు ఇవ్వాలి తిలోదకాలు
అవగాహన బాటల్లో నడవాలి భావిపౌరులు...
బాంధవ్యాలతో పడికిన కుటుంబ
తాను మనస్థాపాల పోగులై
విడివడక మనగలగాలి
పిల్లల ఆత్మగౌరవ పలువలై!!
భారతీయతను నలుదిశలా
ప్రసరింప చేసే విజ్ఞాన జ్యోతులు
వెలిగించాలి నవ్య శోభలై!!

-అమృతవల్లి అవధానం
9052912120

బాల్యం బండీ కావొద్దు!

పిల్లలు
కన్న వారి కలల కను పాపలు
నవ్వుల హరివిల్లులు,
కల్మషమెరుగని ప్రేమ లతలు!.
ఆట పాటల అమాయకత్వపు అడుగులతో,
చెంగు చెంగున ఎగిరే సీతాకోక చిలుకలై,
ఇంటా బయటా అనురాగాలను పంచే
అనుభూతుల పూదండలు వీరు...
బాల్యపు తొలిపొద్దులో
ఎన్నెన్నో ఊహలతో వికసిస్తారు,
ఎదిగే కొద్దీ బాధ్యతల పుస్తకాలతో
లోకపు తీరుతెన్నులు నేర్చుకుంటారు...
పెద్దల ముందర బుద్ధి మంతులై మెరుస్తారు,
ఒంటరి వేళల్లో అల్లరి పిడుగులై ఆడుకుంటారు...
'పిల్లలే రేపటి పౌరులు ' అంటాము గానీ...
నేస్తాలతో ఆటలు మరిచి,
అస్తమానం చేతిలో చరవాణి పట్టుకొని
కంప్యూటర్ తెరల వెనుక బంధీలై,
ఇంటర్నెట్ సుడిగుండంలో కొట్టుకు పోతూ,
కాలంతో పాటు పరుగులు తీస్తున్నారు!
చురుకుతనాన్ని కోల్పోయి
యంత్రాలుగా మారకండి బాలల్లారా!
బాల్యాన్ని ప్రకృతి ఒడిలో వికసింప జేస్తూ,
ఉజ్వల భవిష్యత్తుకు మిరే బాటలు వేసుకోండి!

-బాబురావు చల్లగాలి
9941469728

పిల్లలు

పిల్లలది మూగబాష
ఏడుపు సంగీతం
బ్రతుకు రాగం వినిపిస్తూ
పాల పాట ఆలపిస్తారు.
పిల్లలది సహజంగానే
కొంటెతనపు అల్లరితనం
తల్లికి కూడా అలవికారు
చిన్నికృష్ణుడే ఆదర్శం.
పిల్లలు దైవస్వరూపులే
కల్లాకపటం తెలియనివారు
దేవుడయినా అవతారంలో
పుట్టి పెద్దగా ఎదగాల్సిందే.
పిల్లలు కరుణామయులు
బోసినవ్వుల చిందిస్తేను
కసాయికైనా చిరునవ్వు
మోమున మెరవాల్సిందే.
పిల్లలు చైతన్య శీలురు
కాలు చెయ్యి ఆడాల్సిందే
ఆట విన్యాస చేష్టలకు
ఎవరైన మురవాల్సిందే
పిల్లలు రేపటి పౌరులు
పెరిగే నేటి మొక్కలాగే
ఎదిగి మానై జ్ఞాన ఫలాలు పెద్దలకు
ఇవ్వాల్సిందే.

-బండ్ల సుబ్రహ్మణ్యం
9908669424

మనుగడకు నాందీ వాక్యాలు!!

మనిషి మనుగడకు నాందీ వాక్యాలు
భవిత వాకిట భాగ్యోపేత ఉషస్సులు
నింగిని చుంబించే ఆశల నక్షత్రాలు
నిన్నటి సంస్కృతిని రేపటితో కలిపే వారధులు !!.
కల్మషమెరుగని నవ్వుల సిరులు
చిలిపి అల్లరుల చినుకు తుళ్ళింతలు
ఎల్లలెరుగని ఆనందాల చిరునామాలు
అలుపెరుగక గెంతే తువ్వాయిలు !!.
మమతల తీవెలపై విరిసే స్వచ్ఛమైన మల్లెలు
అమ్మా నాన్నల వలపు పంటల తీపి గురుతులు
అమాయకపు కళ్ళతో అలరించే మెరుపుతునకలు
నట్టింట్లో నడయాడే నాట్యమయూరాలు!!
ఉత్సాహపు ఊపిరిలూదితే అందుకుంటారు
ఆశల అంబరాలు
నిర్లక్ష్యానికి గురిచేస్తే దిగబడతారు

-అయ్యగారి సూర్యనారాయణ
9440664610

అంకురం

విజయం సాధించాలనే
గట్టి సంకల్పం
చీకటినైనా చీల్చుకొని
ఎదురీది పయనిస్తుంది వెలుగు వైపు...
యాతనను అనుభవిస్తున్నా
ప్రాణాలకు తెగించి
ఓ జీవికి జన్మ నివ్వాలన్న
తపన ఉన్న తల్లిలా...
హృదయం పిండేస్తున్నా
మెదడును తొలిచేస్తున్నా
మేధోమథనాన్ని చేసి కవి
హృదయం నుండి జాలువారే కవిత్వం లా...
కష్టాలను లెక్కచేయదు సంకల్ప బలం
ఆటంకాలను అధిగమించి
విజయం సాధించడమే దాని
లక్ష్యం...
భూగర్భ చీకటిని చీల్చుకొని..
వెలుగు వైపు తొంగిచూసింది
నిటారుగా తలెత్తింది చిన్ని
అంకురం...
ప్రాణవాయువును
అందించడమే
దాని పరమార్థం...

-నంద్యాల సరస్వతి
94904 82795

కులం కన్నా గుణం గొప్పది (మానవత్వం)

కులమతాల కుమ్ములాటలే
ద్వేయం కొందరికి
పొట్టకూటి అగజాట్లే ఇంకొందరికి
మానవత్వాన్ని పరిమళింపజేయాలి
మనం ఎప్పటికి.....!.
సృష్టికి జీవం పోసిన దేవుడు
ఒక్కడే కానీ మనుషులు గీసుకున్న
గీతలు ఎన్నెన్నో
కులమంత ఒక కంచె
మతమంత ఒక గోడ
ఈ నడిమధ్యన నలిగిపోతోంది
మానవత్వం.
కులం కూడు పెట్టదు మతం మంచినీళ్లుఇవ్వదు
సంస్కారమే
సాయం చేస్తుంద మమకారమే
సహాయం చేస్తుంది
గాలికి లేదు కులం నేర్పు లేదు
కులం చెట్టుకు లేదు కులం నేలకు లేదు
కులం మనుషులం మనకెందుకు ఈ కులం
ఈ భూలోకంలో ఎవరికి లేని కులం
దేవుడి సృష్టించిన ఈ సంపదనకు లేని కులం
మానవజాతికి ఎందుకు కులం
మతం గోడలను బద్దలు కొడదాం సమాజాన్ని
మానవత్వం అనే రాయితో నిలబెడదాం

-దారా శ్రీకాంత్
9676059716

మన్నించు మా

పూలతో నిండుగా నవ్వుతున్నా
విద్యుత్ తీగల కోసం
గొడ్డలికి నిన్ను అప్పజెప్పాను
ముక్కలైన నీ దేహాన్ని చూసి
గుండెలవిసేలా ఏడ్చాను
మోడైనా కొత్త చిగుర్లతో
నా కన్నీరు తుడిచింది ఆ మాను ....
మౌనంగా ఉన్న మానవివి
మోడు గా మారి ఆశల
చిగురులు తొడిగిన ప్రాను
కుఠారము దెబ్బకు తల్లడిల్లిన నీ మేను
అలుక లేక అలసిన
నీ మేను చిగురించే.
నీ బోదె లోనే ప్రాణం నింపుకొని
శ్వాస తీసుకుంటూ
కొత్త లోకం లోనికి కొత్త
ఈసడించుకోక ఈరికలు
ఇచ్చి కనువిందు చేయుట
నీ చల్లని మదికి తార్కాణం.
పరిమళం ఎరుగని..
ఆసరా ఎరుగని
ప్రాణవాయువు విలువ
ఎరుగక మోడుగా మిగిల్చిన
పచ్చని నీ పర్ణములు
పంతములేక, పగ లేక
రాలిన చోటే క్రొత్త నవోద్భిదం
తో బాధ పడిన మదికి
లేలేత చిగురులు లేపనం పూసే
మానువు నీవు
మానవత్వం మరిచిన మనిషిని
మన్నించే మహిరుహమా
మన్నించు మా.....

-గాయత్రి చిరుమామిళ్ళ
81212 80797

అసూయ తగదు

(కథ)



-సంగనభట్ల
చిన్న రామకిష్టయ్య
9908554535

నరసింహపురంలోని గోపయ్య, రమణయ్య గ్రామంలోని రచ్చబండ వద్ద ఒక దగ్గర చేరారు. గోపయ్య రమణయ్యతో "రమణయ్యా! ఈ వేసవికాలం నా ఇబ్బంది ఏమని చెప్పను" అని అన్నాడు.

ఈ మాటలను అప్పుడే అక్కడికి వచ్చిన శరభయ్య విని "ఏమైంది" అని అడిగాడు. "మా బావిలోని నీరు ఎండిపోయి ఒక మైలు దూరం నుండి రోజు నీటిని మోసుకోవాల్సి వస్తున్నది. నా జబ్బలు పోతున్నాయనుకో!" అని అన్నాడు. అప్పుడు శరభయ్య "ఇదొక సమస్య నా! నువ్వు ఒక పైపు కొనుక్కొని ఆ ఇంటి వారిని అడిగి వేసుకొని మోటార్ ద్వారా నీటిని తెచ్చుకోవచ్చు కదా!"అని అన్నాడు. అప్పుడు గోపయ్య " అయ్యా! నా వద్ద డబ్బు లేదు "అని అన్నాడు." నేను ఇస్తాను. ఇది సమస్యనే కాదు. నాకు తర్వాత ఇవ్వు" అని అన్నాడు శరభయ్య. సరేనన్నాడు గోపయ్య.

తర్వాత రమణయ్య "నాకు నీకన్నా పెద్ద సమస్య ఉంది గోపయ్యా! నేను ఏం చెప్పను? "అని అన్నాడు. అప్పుడు శరభయ్య " అది నీటి సమస్య కాదు కదా!" అని అన్నాడు. "కాదు కాదు. ఇంటి సమస్య. ఈ వేసవిలో నేను ఉండే రేకుల షెడ్డు వేడికి నేను నా కుటుంబ సభ్యులు తట్టుకోలేక పోతున్నాం. మాకు వడదెబ్బ సోకే ప్రమాదం ఉంది "అని అన్నాడు. అది విన్న శరభయ్య "నీది కూడా ఒక సమస్యనేనా? ఈ రెండు, మూడు నెలలు ఇల్లు మార్చి మరో ఇంటిలో అద్దెకు ఉంటే సరే! నీకు వడదెబ్బ సోకే ప్రమాదం తప్పుతుంది " అని అన్నాడు. "అయ్యా! నాకు కూడా డబ్బు సమస్యనే"!అని అన్నాడు రమణయ్య. "నేను ఇస్తానుగా! రేపట నుండి మరో ఇల్లు చూసుకో!" అని అన్నాడు శరభయ్య. సరేనన్నాడు రమణయ్య.

తర్వాత శరభయ్య " మిత్రులారా! నాది డబ్బు ఉండి కూడా ఎవ్వరు తీర్చలేని సమస్య" అని అన్నాడు. "అదేమిటో చెప్పండి!" అని అన్నారు రమణయ్య, గోపయ్యలు. "నేను మీలాంటి వారికి సాయం చేస్తున్నాను కదా! నేను ఎంత ఆర్థిక సాయం చేసినా నాకు ఆ ధర్మయ్య వలె పేరు ప్రఖ్యాతులు రావడం లేదు "అని అన్నాడు.

ఇంతలో ఆ ధర్మయ్య అక్కడికి వస్తూ ఈ మాటలను విన్నాడు. "ఏంటి శరభయ్య? నా గురించి ఏదో అంటు న్నావు" అని అన్నాడు. శరభయ్య నాలుక్కరచుకొని "అయ్యా! నీవు డబ్బు ఖర్చు పెడుతున్నావు. నేను కూడా డబ్బులు ఖర్చు పెడుతున్నాను. నీకు పేరు ప్రఖ్యా తులు వస్తున్నాయి. నాకేమో రావడం లేదు. అదే నా బాధ "అని అన్నాడు.

అది విన్న ధర్మయ్య నవ్వి "శరభయ్యా! ఈ అసూయ నీకు పనికిరాదు. నీవు నీ మిత్రులకు, బంధువులకు,నీకు తెలిసిన వారికి మాత్రమే ఆర్థిక సాయం చేస్తున్నావు. కానీ నేను వారితో పాటు నాకు తెలియని వారికి కూడా అనేక రకాల సాయం చేస్తున్నాను. నీకు డబ్బుంది కానీ మనశ్శాంతి లేదు. నాకు డబ్బు ఉంది. మనశ్శాంతి కూడా ఉంది. ఎందుకంటే నేను నాకున్న డబ్బులు సగం వ్యాపారంలో పెట్టుబడి పెడుతున్నాను. ఇంకొక పాతిక వంతు నా సొంతానికి వాడుకుంటున్నాను. మరో పాతిక వంతు దానధర్మాలు చేస్తూ అన్న సత్రా లు కట్టించి అన్నదానం చేస్తున్నాను. ఎంతో మంది పేదవాళ్ళు అందులో కడుపులో నింపుకొని నన్ను దీవిస్తు న్నారు. అన్నదానాన్ని మించింది ఏదీ లేదు. ఎవరైనా కడుపుకు పట్టిన ంతనే తింటారు. ఇక డబ్బు అంటా వా! ఎంత ఇచ్చినా వారికి అసంతృప్తి గానే ఉంటుంది. మరో సంగతి! అదేమి చిత్రమో గానీ నేను వ్యాపారం చేసిన ప్రతిదానిలో నాకు లాభాలే వస్తున్నాయి. బహుశా ఇది అన్నదానం మహిమ, పేదవారి దీవెనలు కావచ్చు "అని అన్నాడు.

అది విన్న శరభయ్య " ఓహో! నాకు ఇపుడు అర్థమైంది ధర్మయ్యా! నేను కూడా నీలాగే నా డబ్బులను ఖర్చు పెట్టి చూస్తాను. అప్పుడైనా మన శ్శాంతి దొరుకుతుందేమో చూడాలి "అని అక్కడినుండి వెళ్లి ధర్మయ్య చెప్పిన ప్రకారమే చేశాడు. కొద్ది రోజుల్లోనే అతనికి వ్యాపారంలో లాభం రావడం ప్రారంభమైంది. ఎంతో మంది ధర్మయ్య తో పాటు శరభయ్యను కూడా ప్రశంసించి దీవించడం ప్రారంభించారు. అతనికి మనశ్శాంతి ఏర్పడి హాయిగా నిద్ర పట్టింది. అప్పటినుండి శరభయ్య ఇతరులపై అసూయనే తన మనశ్శాంతి లేకపోవడానికి, నిద్రలేమికి కారణమని భావించాడు. పిల్లలూ! అందుకే ఇతరులపై అసూయ పనికి రాదు.



మేధల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి.

కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1927వ రోజు 'జాతీయ సమైక్యత' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'జాతీయ సమైక్యత' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



మేధల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం

అడ్మిన్ & నిర్వహణ

డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్‌రావు,
9441046839

ఆలోచించాలి

జాతి మతం జనీగిట్ల చేరిననీక
వేలు పెట్టి చూపడానికి ఏది ఎరుక?
స్వార్థం సందులో దూరి
మరక పెట్టినప్పుడు తప్ప.
భారత జాతి బిడ్డలే అందరు
ఆడ మగ జాతులు సృష్టికర్తలు
కలిసి పంచుకునే కష్టసుఖాలు
బంధువులు
జాతీయ సమైక్యత ఇదే మూలం.
పశువులకు పక్షులకు ఏది కులం?
మనుషులకు ఎందుకు ఈ దౌర్భాగ్యం?
స్వార్థ పరులు చేస్తుంటే రాజకీయం
తనను తాను గిరి పెట్టుకొని
అవుతున్నారు బానిసలు
కులం మతం కుంపటిలో
కృశించి పోతుంది
జాతీయ సమైక్యత.
భావిభారత పౌరులకోసం
మానవ జాతి ముందుచూపుతో
వీడాలి బానిసత్వం
ఎవరికి వారు అందరివారుగా
ఆలోచించాలి
జాతీయ సమైక్యత కోసం.

-పొన్నాల ధనమ్మ

భిన్నత్వంలో ఏకత్వం

భిన్నత్వంలో ఏకత్వం
అనేకతలతో సమైక్యత
విశేషాల్లో వివేకం
మన దేశపు ప్రత్యేకత.
అన్ని అలంకారాల జాతి
అనాదిగా సంతరించుకున్న
సంస్కృతి
ఆర్జించింది విశ్వ విఖ్యాత ఖ్యాతి
కాని గాజు పలకల భవంతి.
జాతి సమైక్యతకు
దేశద్రోహుల పెట్టే చిచ్చు
విసిరే రాళ్లు
బయట కంటే
లోపల నుండే హెచ్చు.
నీచ కుటిల రాజకీయాలు
పరోక్ష విదేశ విధ్వంసక కుట్రలు
జాతి, మత, భాష, ప్రాంత
వర్ణ భేధాల విభజించు
విద్రోహక శక్తులు,
జాతి సమైక్యతకు ఇక్కట్లు.
సమానత, సహాయత
సహనశీలత సత్సంకల్పాలే
సమైక్యతను
ధృఢ పరిచే సాధనాలు.
సదవగాహన, త్యాగనిరతి
జాతిపై గౌరవాదరాలు
విద్రోహక శక్తులను
ఏరి పారేయటమే సమాధానం.

-రాజప్ప

మానవత్వమే అభిమతం

మనుషులందరూ ఒక్కటైతే
కులమతాలెందుకటా?
భారతీయులం అందరమైతే
బానిసత్వం ఎందుకంటా!.
నింగిలో మేడలు కట్టి
నిలువుటద్దంలో చూపిస్తున్నా
నీతి లేని మనుషులెందరో
నీడలేక తిరుగుతున్నారు!.
నాది నీది వేరు కాదు
మనిషి మనిషికి పరాయి కాదు!
మానవత్వమనే మంచి కులమే
మన అందరి నినాదం
కావాలి మరి!.
నా కులమే గొప్పది
నా మతమే గొప్పది
అని చెప్పే పెద్దలారా!
ఒక్కసారి ఆలోచించండి!.
ప్రేమానురాగాలు పంచుతూ
భారతీయతను చాటుదాం!
భారత రాజ్యాంగ
స్ఫూర్తిని గుండెల్లో నింపుదాం!
స్వేచ్ఛ, సమానత్వం
సోదరభావం
మన జీవితాలకు
మార్గదర్శకాలుగా చేసుకుందాం!.
మనమందరం ఒక్కటే
మన దేశం ఒక్కటే
మనుషులంతా సమానమే
మానవత్వం మన ధర్మమే!.
కులవివక్షను రూపుమాపుదాం
మతవిద్వేషాన్ని తరిమికొడదాం!
ఐకమత్యపు జెండా ఎగరేద్దాం
నూతన భారతాన్ని నిర్మిద్దాం!.
సమానత్వమే మన నినాదం!
మానవత్వమే మన అభిమతం!!.

-డా.అరుణా పరంధాములు

నవ్వు పువ్వు

ఉన్నది రెండు జాతులు
ఆడ మొగ
ఆ రెంటిలో సమైక్యత ఉంటే
అదే జాతి సమైక్యత
అది ఎలాగూ లేదు.
మనిషికి మనిషికి
మధ్య శరీర నిర్మాణంలో
ఎక్కడుంది భేదం
రెండే రకాలు తప్ప భేదం
లేదన్నది నిజం
జాతి మత కుల భేదాలు
మనిషి స్వార్థానికి కొలబద్దలు
రాజులోని రక్తమే ఉంది
రక్షక భటునిలోకూడా
ఇద్దరికీ తేడా ధనంలోనే
అక్కడే ప్రారంభమైంది వేర్పాటువాదం
దానికి తోడ్పాటు

ఒకటిగా...

దేశంలో రాష్ట్రాలకు వేర్వేరు భాషలు.
ప్రతి ఒక్కరికి ఉంటుంది
వారి భాష మీద అభిమానం
భాషలు వేరైనా
సంస్కృతి సంప్రదాయాలొకటే
అందరిలో రావాలి
మనుషులందరూ ఒక్కటే అనే భావన.
అందరూ సోదరుల్లా మెలగాలి.
న్యాయాలయమొక్కటే.
రాజ్యాంగమొక్కటే.
నియమాలు
అందరూ పాటించవలసిందే.
ఏ తప్పు చేసినా
అందరికీ శిక్ష ఒక్కటే.
ఏ రాష్ట్రమైనా
ఏ భాష అయినా
ప్రతిభ ఉంటే
గౌరవం ఒక్కటే.
మెలగాలి అందరూ
మానవత్వంతో.
ప్రవర్తించాలి
సోదర భావంతో.
రాకూడదు కులమత బేధాలు
భాషా భేదాలు.
కొంతమంది చేస్తారు
మతం పేరుతో
ప్రజల మధ్య
విభేదాలు సృష్టించడం.
రాజకీయ లాభంతోనో
స్వలాభంతోనో
వాటిని నమ్మకుండా
సమైక్యతతో మెలగాలి.
భారతీయులందరూ
ఒకటిగా ప్రవర్తించాలి.

-డా.షహనాజ్ బతుల్

నోటితో!

అంతా మనమంతా
ఒక్కటే నినాదం
జాతీయ పండగలప్పుడే నాదం
చేతల్లో వాతలు
నోటితో కూతలు!
కవులకు తప్పదు
ఐక్యతపై రాతలు.
కీర్తికండూతి
కండకండల్లో అవినీతి
పక్కవాడిపై అక్కసు
పదవీకాంక్షతో
బుస్సు బుస్సు
ఒక్కడి మంచిమాట
నేనెందుకు వినాలనే
ఆక్రోశం దుగ్ధ!
పదవుల పెదాలందుకోవాలనే
నక్క జిత్తులు
నాకంచం నామంచం
అనే సంకుచితత్వం
ఆనాడు
స్వాతంత్ర్య యోధుల త్యాగాలు
ఈనగాచినక్కపాలు
దేశం స్వాతంత్ర్యంకోసం
ఏకతారాగంతో నాడు
నేడంతా తారుమారు!
నెత్తిన మొట్టే కత్తిలా
నాలుకదూసే
గుంటనక్కల కుట్రలు.
నేడు అసహనంతో
పక్కవాడిని కొట్టు
నాకింత పెట్టు అనే
వితండవాదం,
కండువాలు కప్పుకొన్న
మండువాల్లో నిత్యసంఘర్షణ
కుటుంబాల్లో ముసలం
సమైక్యత కొరవడి అనైక్యత
సిగపట్లు.
ఇదే పారతంత్ర్యానికి మెట్లు
కవుల కలాల్లో
ఆకాశవాణి పాటల్లో సమైక్యత
మనలో మనం పోట్లాడుకుంటే
మనకే నష్టం
అదే మహాభారతంలో
మౌసలపర్వం, కురుక్షేత్రం.

-ఎ.రాజ్యశ్రీ

మన గమ్యం

కోటి నదుల కలయిక
ఒకే సాగరమై సాగినట్లు
కోట్లాది గుండెల స్పందన
ఒకే భారత్ అని పాడినట్లు!
హిమగిరి నమస్కరించే
పవిత్ర భూమి మనది
సాగర పాదప్రక్షాళన చేసే
మహోన్నత శక్తి మనది!.
విభిన్న భాషల తేనె సోనలు
ఒకే తీరంలో కలవాలి
విభిన్న సంస్కృతుల వర్ణాలు
ఒకే ఇంద్రధనస్సుగా వికసించాలి
కాశ్మీరు శీతల పవనాలు
కన్యాకుమారి సాగర అలలు.
పాడేది ఒకే పాట
అది జాతీయ సమైక్యతా బాట!
ఉక్కు మనిషి పటేల్
వెలిగించిన ఐక్యతా జ్వాలలు
దిశదిశలా పారదోలాలి
భేదభావాల చీకట్లు!.
రాజ్యాల సరిహద్దులు దాటి
సమగ్రతను చాటడం
స్వార్థపు ఆలోచనలు వీడి
మమకారాన్ని పంచడం!
కులమనే పంజరాన్ని
బద్దలు కొడదాం
మతమనే ప్రాకారాన్ని దాటి
ముందుకు సాగుదాం.
ద్వేషపు జ్వాలలకు
స్నేహపు వర్షంతో
సమాధానం ఇద్దాం,
భారతాంబ ఒడిలో
అందరం సోదరులుగా నిలుద్దాం!
అమరవీరుల త్యాగాలకు
నిజమైన నివాళి ఇద్దాం,
శాంతి, సామరస్యాల సుగంధాలను
దిక్కులు పిక్కటిల్లేలా చల్లుదాం.
ప్రగతి బాటలో ప్రవాహమై
ముందడుగు వేద్దాం,
ప్రపంచ వేదికపై భారతదేశాన్ని
అగ్రగామిగా నిలపడమే మన గమ్యం!
సమైక్యతా వెలుగులతో
విశ్వశాంతిని చాటడమే
అంతిమ గమ్యం!.

-గుండవరం కొండల్ రావు

కలిసి ఉంటే కలదు సుఖము

పాడాలి పాడాలి ఐక్యతా రాగం
ఉండాలి ఉండాలి ఆనంద తీరం
కలిసి మెరవాలి అందరం.
ముక్కులు ముక్కలుగా వున్న దేశం
ఒక్కటై అలరారుతుంది నేడు
సర్దార్ పటేల్ ధీరగుణం
మన జాతినొకటి చేసిన నైపుణ్యం
దేశ భవితకు పుణ్యం.
చిన్న రాజ్యాలను
ఒక చోట చేర్చగా
బుద్ధి కుశలతే తోడు నీడగా
భారత దళాలను పంపి
నిజాం గర్వాన్ని
అణచివేసిన ఘనుడు
చిన్న రాజ్యాలను
మిళితం చేసిన ధీరుడు
అఖండ భారతావనికి
తిలకం దిద్దిన వీరుడు.
ఐదు వేళ్లు కలిస్తే పిడికిలి
రెండు చేతులు కలిస్తే చప్పట్లు
కులమతాల చిచ్చు లేకుంటే
తగ్గు పాట్లు
మనుష్యులు పాడాలి
ఐక్యతా రాగం
ఐకమత్య గీతం
కశ్మీర్ నుండి
కన్యాకుమారి దాకా
అఖండ భారతం
మనదే మనదే నిత్య నూతనం
ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్.

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

గో..గో..గూగుల్



'మేంగో' కాలమ్



- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

అదో పెద్ద పత్రిక. అక్కడ చాలా సీరియస్‌గా సమావేశం జరుగుతోంది. ముఖ్యంగా సంపాదకవర్గ సభ్యులంతా పాల్గొన్నారు. ఇంత హడావుడిగా ఈ సమావేశం ఎందుకు జరుగుతుందో ఎవరికీ అర్థం కావటం లేదు. ఎవరి తల మీద కత్తి వేలాడుతుందో అని భయపడిపోతున్నారు. ఒకప్పుడు ఆఫీసులో అందరికీ తలో ఛాంబర్ ఉండేది.

ఆదివారం సంచికలు, స్పోర్ట్స్ కాలం, సినిమాలు, రోజూ ఆడవారికి, పిల్లలకు, మొత్తంగా ఫ్యామిలీకి స్పెషల్ పేజీలు ఉండేవి. ఆరోగ్యం నుండి వారఫలాల దాకా దేనికదే ప్రత్యేకం. ఎవరికీ తీరిక ఉండేది కాదు. దానికి తోడు ఎప్పటికప్పుడు విరుచుకుపడే వార్తలు, యుద్ధాలు, ప్రకృతి బీభత్సాలు - అందులో ఏది ప్రచురించాలి. ఏ వార్తకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రత్యేక కథనాలు ఇవ్వాలి. గాసిప్స్ వదలాలి - ఇదే ప్రపంచం.

కోవిడ్ వచ్చింది. ముందు బతికి బట్ట కట్ట 1గలమా అనుకున్నారు. పోయినవాళ్ళు పోయారు. ఇప్పుడు బట్ట, తిండి, కొంప ఇవి పెద్ద సమస్యలు అయ్యాయి. ఆఫీసులు మూసేశారు. గోడౌన్లు చేశారు. అక్కడనుంచి తీసివేతలు మొదలయ్యాయి. ఇది ఓ పత్రికకు మాత్రం పరిమితం కాదు.

ఇప్పుడు ఛాంబర్లు లేవు. నాలుగయిదు టేబుల్స్ - ఓ చిన్న గది. మొత్తం కార్యక్రమాలన్నీ ఆ గదిలోనే సాగాలి.

ఇది వరకు ఏ.సీ.లున్నాయి. కనీసం కూలర్స్ ఉండేవి. రెండుసార్లు చాయ్ లు వచ్చేవి. అన్నీ బంద్. అలా సంవత్సరాలుగా పని చేస్తున్నవారు 'అల్వీద' చెబుతూ మిగిలినవారి వంక చూసూ.. 'రిటైర్మెంట్ నహజం. ఇవి బలవంతపు గెంటివేతలు. మేం ఈరోజు బయటకు పోతున్నాం. రేపు మీరు వస్తారు.

వెల్‌కమ్' అని పోతున్న దృశ్యాలు వారి కళ్ళముందు కనిపిస్తున్నాయి.

ఇంతలో ప్రధాన బాధ్యుడు వచ్చాడు. అందరూ జడ్జ్ గారు కోర్టులోకి ప్రవేశించి సింహాసనం మీద కూర్చునేటప్పుడు లేచి నిలబడినట్లు లేచారు. ఆయన అందరినీ కూర్చోమని సైగ చేశాడు. కూర్చున్నారు. వారు మాట్లాడటం మొదలుపెట్టారు.

"ఇది ఏ.ఐ. యుగం. ఇది మీ అందరికీ తెలుసు. మన పత్రికలో అనేక శీర్షికలు ఉన్నాయి. వాటికి పదులకొద్దీ రైటర్స్ కాంట్రిబ్యూట్ చేస్తున్నారు. అవన్నీ మీరు ఎడిట్ చేస్తున్నారు. కాంట్రిబ్యూటర్స్ కి మనం పారితోషికాలు ఇస్తున్నాం.

అవునా?"

"అవును సర్" ముక్తకంఠంతో అన్నారు.

"అవన్నీ ఇకనుండి బంద్."

హాలు నిశ్శబ్దం అయిపోయింది.

"మనకు వస్తున్న ఆర్టికల్స్ అన్నీ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా జెనరేట్ అవుతున్నవే అని మీ దృష్టికి వచ్చింది కదా!" అందరూ తలలూపారు.

"మరి మనం ఎందుకు వారికి 'పే' చేయాలి. పురాణాలు, ఉపనిషత్తులు, వేదాలు ఔపోసన పట్టినవారు ఇవన్నీ రాస్తున్నారా? అలాంటివారు దాదాపు మరణించారు. అది ఆధ్యాత్మికం, వైద్యం, వాటెవర్ సబ్జెక్టు గూగుల్ అమ్మ తల్లి పుణ్యమే కదా. రకరకాల ఏప్స్ నుండి ఎత్తిపోతలే కదా. చాట్ జి.పి.టి, గూగుల్ జెమినీ - ఇంకా సవాలక్ష ఉన్నాయి.

చివరకు ఎ.ఐ. కూడా మరోసారి చూసుకోండి, క్రాస్ చెక్ చేసుకోండి అని ముందే హెచ్చరికలు చేస్తున్నాయి. అవి ఎవరన్నా చేస్తున్నారా?" అందరూ ఒకరి ముఖాలు ఇంకొకరు చూసుకున్నారు.

"FACT CHECK" APPS ఉన్నాయి కదా. అవి ఎవరన్నా చెక్ చేసుకుంటున్నారా? మిరన్నా చూస్తున్నారా?" సూటిగా అడిగాడు ఆయన.

ఎవరో ఏదో మాట్లాడబోయారు. వారిస్తూ..

"లిజన్. ఇకనుండి అలాంటి కాంట్రిబ్యూటర్స్ మనకు అవసరం లేదు. అలాంటివారిని ఫేస్‌బుక్ లకు, వాట్సాప్ గ్రూపులకు పరిమితం అవనిద్దాం. ఇప్పుడు మనం ఏ శీర్షికలూ, ఏ స్పెషల్ పేజీలూ ఆపటం లేదు. అవన్నీ కొనసాగుతాయి. అయితే మీరు గూగుల్ని అడిగితే వెయ్యి పేర్లను నిమిషాల్లో అందిస్తాయి. వారి పేర్ల మీద ఇక నుండి ఆర్టికల్స్ వస్తాయి. ఇకనుండి మీరు ఎడిట్ చేయటం కాదు చేయాల్సింది. ఎ.ఐ. ద్వారా కాంట్రిబ్యూట్ చేయటం.

అలాగే ఫ్యాక్ట్ చెక్ చేయటం. ఎ.ఐ. జనరేట్ చేసిన ప్రతి ఆర్టికల్ ను చూసి సరిదిద్దటం. ఇందులో పదిమంది పనిచేసే చోట ఐదుగురు చాలు అని మేనేజ్‌మెంట్ నిర్ణయం తీసుకుంది. అందుకు నెల రోజుల సమయం ఇస్తున్నారు. ఎవరు ఎంత వేగంగా ఈ పనులు చేయగలిగితే వారుంటారు. లేదా మీకు?"

అర్థం అయింది. వారికి పింక్ స్లిప్ లు గుర్తొచ్చాయి.

"ఇంకా మనకు చిత్రకారులతో అవసరం లేదు. కార్టూనిస్టులు అవసరం లేదు. పేజ్ మేకింగ్ నుండి అన్నీ ఒకరిద్దరు మాత్రం చూసుకుంటారు. మిగతావారు ఇంకో మార్గం చూసుకోండి. లేదా ఎవరుంటారో తేల్చుకోవటానికి వారికి కూడా నెలరోజుల సమయం ఇస్తున్నాం."

అప్పుడు ఒకతను లేచాడు.

"అన్నీ ఎ.ఐ. జనరేట్ చేస్తుంటే ఇంక నేటివిటీ ఏముంటుంది సర్. మెల్లగా పాఠకులకు దూరం అయిపోతాం కదా!" అన్నాడు.

"పాఠకులు అని మనం అంటాం. ప్రజలు అంటుంటారు కదా. వారు లేచిన దగ్గర్నుండి ఎవరి మీద ఆధారపడుతున్నారు. ఏ.ఐ. మీదే కదా! అసలు ఏది నిజం? ఏది ఫేక్ - ఏది డీప్ ఫేక్ అని ఆలోచించే తీరిక ఎవరికయినా ఉందా మిస్టర్. మీలో వాయిస్ ఉన్నవారు, తెలివి ఉన్నవారు యూ - ట్యూబ్ ఛానల్స్ పెట్టుకోండి.

లేదంటే అలాంటి చోట్లకు వెళ్లి విశ్లేషణలు చేయండి. ఇప్పుడు మనం గొప్ప కథల, నవలల పోటీ ప్రకటించబోతున్నాం"


అని ఎవరో లేపటం చూసి -

"లిజన్ - ఇవి కూడా గూగుల్ చెప్పిన పేర్లకే ఇవ్వాలా అని మీరు అడగబోతున్నారు. కాదు. ఇది నిజమైన పోటీ.

ఇందులో హోమో పత్రం మారుతుంది. ఇది నా కడుపులో పుట్టిన రచన. ఇది ఎ.ఐ.కి గాని చాట్ జి.పి.టీ - గూగుల్ జెమినీ జనరేట్ చేసింది కాదు అని డిక్లరేషన్ ఇవ్వాలి. ఇదివరకు మనం న్యాయ నిర్ణేతలను ఏర్పాటు చేసుకునేవాళ్ళం. ఇప్పుడు ఎ.ఐ, గూగుల్ న్యాయ నిర్ణేతలు. వారికి ఫీడ్ చేస్తాం. అందులో నిజంగా కడుపులో, కడుపు చించుకుపుట్టిన రచనలు ఉంటే వారికి గొప్ప సన్మానం చేద్దాం. అలాగే అనువాదాలు కూడా. తిరిగి మనందరం ఆరు నెలల తర్వాత కలుస్తాం. అప్పుడు ఈ అనుభవాలతో కొత్త నిర్ణయం తీసుకుందాం. "బై" అని వెళ్ళిపోయాడు.

ఇది మీకెలా తెలుసు అంటారు - మా సోర్సెస్ మాకుంటాయి. పత్రికలన్నీ మూతబడతాయా? కొత్త రూపంలోకి వస్తాయా? మీరు ఊహించండి. లేదా మనకుందిగా గూగుల్!

సామాజిక రుగ్మతలపై రచనలు చేయాలి



రచయిత్రి కొండపల్లి నీహారిణికి 'వంశీ- లత జాతీయ సాహితీ పురస్కారం' ప్రదానంచేస్తున్న అతిథులు వంశీ రామరాజు తెలుగు అకాడమీ పూర్వ డైరెక్టర్ ప్రొ. సుశీలమ్మ, ప్రముఖ రచయిత్రి జలంధర చంద్ర మోహన్. అత్తలూరి విజయలక్ష్మి.

హైదరాబాద్, నవంబర్ 18: రచయితలు సామాజిక రుగ్మతలపై రచనలు చేయాలని తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొ. కూరపాటి వెంకట నారాయణ అన్నారు. వంశీ ఆర్ట్ థియేటర్స్ లేఖిని తెలుగు రచయితల మహా వేదిక ఆధ్వర్యంలో సోమవారం త్యాగరాయ గానసభలో ప్రముఖ రచయిత్రి డా॥కొండపల్లి నీహారిణికి **'వంశీ-లత జాతీయ సాహితీ పురస్కారం'**ను బహూకరించారు. కార్యక్రమంలో తెలుగు అకాడమీ పూర్వ డైరెక్టర్ ప్రొ.సుశీలమ్మ, ప్రముఖ రచయిత్రి జలంధర చంద్రమోహన్, అత్తలూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొ. కూరపాటి మాట్లాడుతూ ఒకనాడు సమాజంలో ఉన్న అవకతవకలు వేరు.. నేడు యువతరం ఎదుర్కొంటున్న రుగ్మతలు వేరు అన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతుందని వృద్ధులైన తల్లిదం ద్రుల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్న సంఘటనలు, డ్రగ్స్ అలవాట్లు సమాజాన్ని భ్రష్టుపట్టిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పద్యం తెలుగువారి సొంతం



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, నవంబర్ 18:ప్రపంచంలోని ఏ భాషల్లో లేనిది పద్యమని,పద్యం మనకు గౌరవాన్ని ఆపాదిస్తుందని, అలాంటి పద్యం తెలుగువారికి మాత్రమే సొంతమని ప్రముఖ పద్య కవి, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత డా.నలపోలు నరసింహారెడ్డి అన్నారు. భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ వారి ఆధ్వర్యంలో నవంబర్ 15 ఆదివారం రోజున కరీంనగర్ లోని ఫిలింభవన్ లో ఉదయం వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సాహిత్య సభకు హాజరై రైతుకవి సింగిరెడ్డి రాజిరెడ్డి రచించిన నీలకంఠ శతకం మరియు ఎన్టీపీసీ విశ్రాంత మేనేజర్ రేగుల చంద్రయ్య రచించిన రేగుపూల పరిమళాలు రెండు పుస్తకాల్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్నయ, పోతన తదితర కవులు సమాజ హితం కోసమే పద్య రచనలు చేశారని ప్రస్తుత కవులు కూడా సామాజిక ప్రయోజనం కోరి ఈ శతకాలను రచించారని అన్నారు.ఏ రాష్ట్రం వారు , వారి మాతృభాషను ప్రేమిస్తారని, అధికారులు మాతృభాషలోనే ఉత్తర ప్రత్యుత్తరాలను జరుపుతారని కాని మన తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఆంగ్లంలో జరపడం బాధాకరమని అన్నారు.అతిథిగా విచ్చేసిన ప్రముఖ పద్యకవి తిప్పారపు లక్ష్మీనర్సయ్యాచారి మాట్లాడుతూ ఇద్దరి రచనల్లో కొన్ని సామ్యాలున్నాయని, అందుకే ఇరువురిని జంట కవులని అభివర్ణించారు.

మరొక అతిథి వేములవాడ ద్రోణాచారి మాట్లాడుతూ ఇద్దరు కవులు కూడా సమాజాన్ని చాలా బాగా చదివారని, సమాజానికి చక్కని సందేశాలతో కూడిన పద్యాలనందించారని తెలిపారు.

లోకంలో నీతిని, విలువలను పెంపొందించే విధంగా,కంఠస్థం చేయడానికి అనువుగా సింగిరెడ్డి రాజిరెడ్డి రాసిన నీలకంఠ శతకంలోని పద్యాలున్నాయని, జనసామాన్యులు వాడే పదాలతో పద్యాలు రచించారని ప్రధాన వక్త సామల కిరణ్ పేర్కొన్నారు.మరొక వక్త కె.యస్.అనంతాచార్య రేగుల చంద్రయ్య రాసిన రేగుపూల పరిమళాలు పుస్తకాన్ని పరిచయం చేస్తూ మనిషి ఎప్పుడూ సకారాత్మకమైన ఆలోచనలు కలిగి ఉండాలని,చక్కని ప్రబోధాత్మకమైన పాదాలతో కూడిన పద్యాల పరిమళాలను సమాజానికి అందించారని,ప్రతి ఇంటిలో ఉండదగిన పుస్తకమని అన్నారు.కవి ఉపాధ్యాయుడు తడిగొప్పుల కుమారస్వామి ఆహ్వానం పలికిన సభకు సమైక్య సాహితీ అధ్యక్షులు మాడిశెట్టి గోపాల్, గంప ఉమాపతి, బొమ్మ కంటి కిషన్ ,రాము ఇటిక్యాల, పెద్దిరాజు సత్యనారాయణ రాజు, అన్నాడి గజేందర్ రెడ్డి మేడి చంద్రయ్య, పాక రామ్మోహన్, ఆర్. ఉదయ్ కుమార్,జనశ్రీ జనార్ధన్, కసిరెడ్డి వెంకటరెడ్డి, నగునూరి రాజన్న, మంచికట్ల లక్ష్మణ్, గూడూరు మల్లారెడ్డి, మహమ్మద్ అంకుష్ ,జనగాని యుగంధర్ ,మహంకాళి సుగుణ, ఎం.సీమ, ఎం. శశికిరణ్మయి, షేక్ ఉమర్ అలీ, రాపర్తి వెంకటేశ్వర్లు, డాక్టర్ తిరుమలరెడ్డి, ఆర్ శ్రీనివాసాచారి, ప్రేంసాగర్ రావు,డా.కె మదన్ మోహన్ రెడ్డి,రుద్ర రవిందర్ శతక కర్తల బంధువులు పాల్గొన్నారు.

పుడతాడు
వెడతాడు
వెలుగును
బయట
వెతికేవాడే
చీకటికి భయపడతాడు.

-క్రాంతి రామ్మోహన్ రావు
హైదరాబాద్

ప్రధానం
సమాధానం
జ్ఞాపకం
వస్తువు కాదు
జీవించే
విధానం.

-శ్రీమతి ఎస్.కమలా దేవి
హైదరాబాద్

దేహము
మోహము
మితి మీరిన
మనిషి
జీవితం
హేయము

-పంతుల లలిత
విశాఖపట్నం

వలపులు,
తలపులు
రెండూ
జీవితాన్ని
తిప్పుతాయి
అనుకోని మలుపులు.

-చెరుకుపల్లి గాంగేయ శాస్త్రి
రాజమండ్రి

నస్య సదము



ప్రక్రియా సృజనకర్త:
సుధామ
సెల్:9849297958

ఆగ్రహము
నిగ్రహము
పెద్దలు
కోపగించినా
సంయమననీతో
పొందాలి అనుగ్రహము

-విజయకుమారి
ముదిగొండ
విజయవాడ

ఆకర్షణ
వికర్షణ
నిగ్రహం లేకుంటే
తప్పదు
మానసిక
సంఘర్షణ .

-జ.నాగేశ్వరరావు
దయాల్‌బాగ్

వంచాలి
తుంచాలి
మనసులో
దుర్భావనలు తొలగించి,
మంచిని
పంచాలి

-అచ్యుతునిరాజ్యశ్రీ
హైదరాబాదు

భక్తులు
రక్తులు
సాధనతో
సమకూరు
అద్భుత శక్తి
యుక్తులు

-ప్రసాద్ రావు
విజయనగరం.

రావాలి
పోవాలి
బంధుత్వాలు
కడదాక
కొనసాగిస్తూ
సంతోషంగా నిలవాలి!

-డా.గన్నోజుశ్రీనివాసాచారి
మహబూబ్ నగర్

ఆలయ పునర్నిర్మాణం, పుష్కర ఘాట్ల పనులు గడువులోగా పూర్తి చేయాలి

భక్తుల భద్రత, మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యం

2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలు




ఖమ్మం, నవంబర్ 18: బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలి ధర్మపురి పట్టణంలోని ఉగ్ర ంచారు. పుష్కరాల కోసం కొనసాగు నరసింహస్వామి ఆలయ పునర్ని తున్న పనుల వివరాలను అధికారు ర్మాణ పనులు, రానున్న గోదావరి లను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో పుష్కరాలను పురస్కరించుకుని నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా నిర్మిస్తున్న పుష్కర ఘాట్ల పనులను పాటిస్తూ, నిర్దేశిత గడువులోగా నిర్మాణ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

అనంతరం గోదావరి నది పరివాహక ప్రాంతంలో నిర్మిస్తున్న పుష్కర ఘాట్ల పనులను పరిశీలించారు. ముఖ్యం గా న్యూ ఘాట్స్, రోడ్లు, హెలిప్యా డ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మహాలక్ష్మి ఘాట్ నుంచి వీఐపీ ఘాట్ వరకు చేపడుతున్న రహదారులు, ఇతర మౌలిక వసతుల పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. 2027 గోదావరి పుష్కరా లకు పెద్ద సంఖ్యలో భక్తులు తర లివచ్చే అవకాశం ఉన్నందున వారి కి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు.

భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, రాకపోకలు, ఇతర మౌలిక వసతులను సమగ్రంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఘాట్ల వద్ద అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలపై ముందుగానే ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికా రులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆలయ పునర్నిర్మా ణం, పుష్కర ఘాట్లు, రహదారులు, హెలిప్యాడ్‌ల నిర్మాణంతో పాటు అన్ని ఏర్పాట్లను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ పి. మధుసూదన్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, ఇరి గేషన్, ఆర్ అండ్ బి అధికా రులు, ఎంపీడీవో, తహసీల్దార్, సం బంది త శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రథమ స్వాతంత్ర్య సమర యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి



ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగు బాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగా లు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతం త్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవో ద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసా వర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరి గింది. ఉత్తర, మధ్య భారత దేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది.

1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీ వైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి విస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు.

ఉత్తర భారత దేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది. భారత దేశంలోని బ్రిటిష్ పరిపాలనలో ఝాన్సీ కీ రాణి గ ప్రసిద్ధి కెక్కినది.1857 లో భారత దేశ తిరుగుబాటు దార్లలో ముఖ్యమైన వాళ్ళలో ఆమె ముఖ్యమైనది.ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరం నవంబరు19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసు లోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. 1851లో లక్ష్మీబా యికి ఒక కుమారుడు జన్మిం చాడు. అయితే ఆ పిల్లవాడు నాలుగు నెలల వయసులోనే కన్ను మూశాడు. 1853 లో గంగాధర రావుకు అనా రోగ్యం సోకింది. వేరే బిడ్డను ఎవరినైనా దత్తత తీసుకోమని అందరూ సలహా ఇచ్చారు. దాంతో ఆయనకు దూరపు బందువైన వాసుదేవ నేవల్కర్ కుమారుడైన దామోదర్ రావు అనే పిల్లవాడిని చని పోవడానికి కేవలం ఒక్క రోజు ముందుగానే దత్తత తీసుకున్నారు. 1853, నవంబర్ 21 వ తేదీన గంగాధరరావు మరణించాడు.

హిందూ సాంప్రదాయం ప్రకారం దామోదర్ రావు రాజ్యానికి వారసుడు కావల్సి ఉన్నా బ్రిటీష్ ప్రభుత్వం అందుకు అంగీకరించ లేదు. దామో దర్ రావు రాజాకు రక్త సంబంధం కానందు వలన అంటే దత్త సంబంధం కావున, ఈస్ట్ ఇండియా కంపనీ గవర్నర్ జనరల్ లార్డ్ డల్ హౌసి, సిద్ధాంతం ప్రకారం రావు సింహాసనాన్ని అధిష్టించే అధికారం లేదని అతనిని నిరాకరించాడు. రాణి ఝాన్సీని ఇవ్వకూడదని నిశ్చయించు కొన్నది. ఆమె తన సైన్యాన్ని బలపర్చి, తమకు తాముగా వచ్చిన వాళ్ళను పోగుచేసి ఒక సేనను తయారు చేసింది. మహిళలకు కూడా యుద్ధ శిక్షణ ఇవ్వబడింది. యుద్ధ వీరులైన గులాం గాస్ ఖాన్, దోస్త్ ఖాన్, ఖుదా బక్ష్, లాల భు బక్షి, మోతీ బాయి, సుందర్ – ముందర్, ఖాసి బాయి, దీవాన్ రఘు నాథ్ సింగ్, దీవాన్ జవహర్ సింగ్ రాణి బలగంలో ఉ న్నారు. అలా జరిగిన యుద్ధంలో లక్ష్మీబాయి 1858 జూన్ 17న గ్వాలియర్ లో యుద్ధ సమయములో మరణి ంచింది.గ్వాలియర్ యుద్ధం గురించి జనరల్ రోస్ ప్రస్తావిస్తూ విప్లవ కారుల్లోకెల్లా ఆమే అత్యంత ధైర్య సాహసాలతో పోరు సల్పిందని కితాబిచ్చాడు. ఆమెకున్న ధైర్య ము, పరాక్రమము, వివేకము, భారత దేశంలో 19 వ శతాబ్దములో మహిళలకున్న అధికారం పై ఆమెకున్న ముందుచూపు, ఆమె చేసిన త్యాగాలు ఆమెను స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రసిద్ధ వ్యక్తిగా నిలిపింది. "జోన్ ఆఫ్ ఆర్క్" లాగా ఆమె భారత దేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచి పోయింది.



(నవంబర్ 19... ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి)
-వాసా సుబ్రహ్మణ్యేశ్వర భట్ల
9440595494

తెలంగాణ సాయుధ పోరాట కవి బండి యాదగిరి



సభలో ప్రసంగిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్. వేదికపై కళా జనార్థనమూర్తి తదితరులు.

హైదరాబాద్, నవంబర్ 18: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఎందరో ఆనాడు నిజాం రజాకార్ల దుర్మార్గాలకు వ్యతిరేకంగా, భూస్వాముల దౌర్జ న్యాలను ఎదిరించి పోరాడాలని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. పెన్ను, గన్ను పట్టి ఎది రించిన వారిలో బండి యాదగిరి ప్రముఖుడని ఆయన చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాట కవిగా బండి యాదగిరి గుర్తింపు పొందారని ఆయన గుర్తు చేశారు. శ్రీ త్యాగరాయ గానసభ, తెలం గాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గుం డవరపు హనుమంత రావు కళా వేదికపై గానసభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహాను భావులు మధుర స్మృతులు పరంపర కార్యక్రమంలో భాగం గా బండి యాదగిరి యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ ఒకే ఒక్క పాట నిజాంను రజాకార్ల గుండెలో భయం రేకెత్తించింది. అని ఆ పాట బండేనక బండి కట్టి ఏ బండిలో పోతావురో నిజాం సర్కారోడ అని రాసిన వారు బండి యాదగిరి అని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్థన మూర్తి మాట్లాడుతూ బండి యాదగిరి జన్మించిన తేదీ కచ్చితంగా ఆధారాలు లేవని కానీ తెలంగాణ పోరాట కవిగా ఆయనను స్మరించుకోవడం గానసభ బాధ్యతగా చేస్తోంది అని తెలిపారు.

నారంశెట్టి జాతీయ బాలసాహిత్య పురస్కార విజేతలు

హైదరాబాద్, నవంబర్ 18:పార్వతీపురానికి చెందిన నారంశెట్టి బాలసాహిత్య పీఠం 2023 నుండి 2026 సంవత్సరాలకు విజేతల పేర్లను ప్రకటించింది.

బాలసాహితీ వేత్తలు బి. వి. పట్నాయక్, జొన్న ల గడ్డ (జె) శ్యామలకు 2023, కూచిమంచి నాగేం ద్ర, సంగన భట్ల చిన రామకిష్టయ్యలకు 2024, కాశీవిశ్వనాథం పట్రాయుడు, వడ్డేపల్లి వెంకటేశ్ లకు 2025, కిలపర్తి దాలినాయుడు, డా. అమ్మిన శ్రీనివాస రాజులకు 2026 ఎంపికయ్యారు. ఒక్కొ క్కరికి ఆరు వేల రూపాయల నగదు పారితోషికంతో బాటు, జ్ఞాపిక, శాలువాతో త్వరలో నిర్వ హించబోయే సభలో ప్రముఖుల చేతుల మీదుగా సత్కరిస్తారు. అదే రోజు కథల పోటీలో బహుమతి గ్రహీతలకు నగదు బహు మానంతో బాటు సత్కరిస్తారు. బాల సాహిత్య కథలు పంపడానికి ఆఖరు తేదీ నవంబరు 30 వరకు పొడిగించారు.

-నారంశెట్టి ఉమామహేశ్వరరావు,
కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత, అధ్యక్షుడు, నారంశెట్టి బాల సాహిత్య పీఠం, పార్వతీపురం 9490799203

అవినీతి వ్యతిరేక కవితల పోటీ

హైదరాబాద్, నవంబర్ 18:డిసెంబర్ 9 "అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం" సందర్భంగా గుంటూరు, అమరావతి సాహితీ మిత్రులు సంస్థ, ఆంధ్ర ప్రదేశ్ ఆమ్ ఆద్మీ పార్టీ సంయుక్తంగా నిర్వహిస్తున్న "అవినీతి వ్యతిరేక కవితల పోటీ"కి కవితలు ఆహ్వానిస్తున్నాము. ఆరు పద్యాలు కానీ, ఆరు మినీ కవితలు కానీ ,ఒక వచన కవిత లేదా ఒక గేయం కానీ **నవంబర్ 25లోగా** 9493686165 వాట్సప్ నంబరుకు టైప్ చేసి మాత్రమే పంపించాలి. డిసెంబర్ 9న ఉదయం గుంటూరులో బ్రాడీపేట లోని సర్వీస్ హెల్ప్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో జరిగే "అవినీతి వ్యతిరేక కవి సమ్మేళనం" కార్యక్రమంలో ప్రథమ బహుమతిగా అయిదు వేలు,

ద్వితీయ బహుమతిగా మూడు వేలు, తృతీయ బహుమతిగా రెండు వేలు అందించి సత్కరించటం జరుగుతుంది. రచన పూర్తిగా తామే రాశామని, ఈ పోటీకి ఉద్దేశించి తాజాగా రాసిన ప్రత్యేక రచన అని హామీ కూడా రాయాలి.

-డాక్టర్ రావి రంగారావు, అధ్యక్షులు, అమరావతి సాహితీ మిత్రులు & డాక్టర్ టి. సేవ కుమార్, ఉపాధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ ఆమ్ ఆద్మీ పార్టీ.

పెద్దపల్లి నియోజకవర్గానికి మరో రూ.13.20 కోట్ల నిధులు

-ప్రభుత్వ విప్ విజయరమణారావు


కరీంనగర్, నవంబర్ 18: పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి మరో రూ.13.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఓదెల, పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్ మండలాల్లో మూడు నూతన బీటీ రహదారుల నిర్మాణానికి నిధులు విడుదలైనట్లు బుధవారం వెల్లడించారు. ఓదెల మండలం నాంసానిపల్లి రహదారి నుంచి లంబాడితండా వరకు 3.50 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.6.30 కోట్లు మంజూరయ్యాయి.

పెద్దపల్లి నుంచి ధర్మారం రహదారి మీదుగా గోపయ్యపల్లి వరకు 1.60 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించారు. కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రం నుంచి దమ్మన్నకుంట మీదుగా చిన్నరాతుపల్లి వరకు 3.60 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి రూ.4.90 కోట్లు మంజూరు చేశారు. మూడు రహదారులకు కలిపి మొత్తం 8.70 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం జీఓఆర్టీ నంబర్ 155 ద్వారా నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పెండ్యాల రాఘవరావు జీవితంపై 'ది ఫర్గాటెన్ మావెరిక్' పుస్తకావిష్కరణ సభ

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, వరంగల్ జిల్లా తొలి ఎం.పి.. 1952–1957, పెండ్యాల రాఘవరావు జీవితం ఆధారంగా మను నెల్లుట్ల రచించిన "The Forgotten Maverick" (A Biographical Fiction పుస్తకావిష్కరణ సభ ఈ నెల 24వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సోమాజిగూడ, హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్నారు. ఈ పుస్తకాన్ని వరంగల్ జిల్లా ఎంపీ శ్రీమతి కడి యం కావ్య ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించనున్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీ కె. శ్రీనివాస రెడ్డి , తెలుగు అకాడమీ చైర్మన్ శ్రీ కూరపాటి వెంకట రమణ గౌరవ అతిథులుగా, కాళోజీ అవార్డు గ్రహీత శ్రీమతి నెల్లుట్ల రమాదేవి సభకు అధ్యక్షత వహించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి శ్రీ కందిమళ్ల ప్రతాపరెడ్డి, నల్సార్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీ పెండ్యాల శ్రీకృష్ణ దేవరావు, ప్రెస్ అకాడమీ పూర్వ చైర్మన్ శ్రీ దేవులపల్లి అమర్, ప్రముఖ పాత్రికేయులు, వీక్షణం ఎడిటర్ శ్రీ నెల్లుట్ల వేణుగోపాల్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలకుర్తి దినకర్ పాల్గొననున్న ఈ సభకు

అందరూ ఆహ్వానితులే



దేవుడు మాయమై పోయాడు..

"దే"వుడా ! నీది ఏ మతం?"
"చిత్రమైన మాట మతమంటే ఏమిటి ?
ఎప్పుడూ వినలేదే"
సహస్ర శిరస్సులకు
నొప్పి కలిగేలా వివరించాను
అపునా!
నా పేరు మీద ఇన్ని మతాలా ?
చంపుకునుడా !!
దేవుడనే ఊహ మనుషులకు రాకున్నా
ఈ ప్రపంచం శాంతిగా ఉండేది"
"నిన్ను కన్నవారేవరు మరి ?"
"నాకు తెలియదు!!"
"నువ్వు అనాథవా ?"
"కావచ్చు !"
"నిన్ను స్వయంభువు అంటారు కదా !"
"నీ మాటలు అర్థం కావడం లేదు !"
అయోమయంగా బాధగా
మానవ వికృతిని సహించలేక
సమాధానం చెప్పలేక
దేవుడు మాయమైపోయాడు!!
యుగాల ప్రశ్నకు సమాధానం దొరకలేదు!!
ఇంకా ఇంకా అన్వేషణే ??

-కందాళై రాఘవాచార్య
8790593638

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం – కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను' నేటినిజం పాఠకుల కోసం..
-సంపాదకులు

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

క్షితి గీతి

ధరణి జీవకోటి భరణి
ధరణి సర్వ ప్రాణ కరణి
ప్రవహిస్తుంటేనే నదికి జీవం
ప్రాణం ఉంటేనే శివం !.
ప్రకృతి పరివర్తనలే నివర్తన
ప్రకృతి పరిణామాలే అనువర్తన
గ్రహణాలకు
భూ–చంద్ర కారణం
గతుల తో రణం!.
గ్రహాలకు భూగోళం భరణం
గ్రహణాల వలయ ఆభరణం
గ్రహణాల భరణి
గ్రహాలకు తరణి!.
నీలి నీలి క్షితి
నీళ్ళు లేమి గతి
మారాలి ఈ దుస్థితి
మారకుంటే ప్రాణుల గతి?.

-పట్లోళ్ల బక్కారెడ్డి
9705315250

స్పందన

చలనరహితమేమిమా
మేధోన్నతి కాదు
స్పందనకు వేయి దారులు
నదిలా స్పందించు,లేదా
కెరటంలా స్పందించు.
నీకు తెలుసు
నీలో నది ఉందో కెరటముందో
ఏదీ లేకపోతే నీవెలా మషివౌతావు
నీవెలా మనగలుగుతావు.
స్పందన కరువైన చోట
శోకాలు బుసకొడతాయి
వానపాము నాగుపామౌతుంది
బానిసత్వం విధిలా మారుతుంది.
జ్ఞానోదం
చలనరహితమేమిమా
మేధోన్నతి కాదు
స్పందనకు వేయి దారులు
నదిలా స్పందించు,లేదా
కెరటంలా స్పందించు

- ఎన్. నరేశ్ చారి

తెలుగు భాష తియ్యదనం

తెలుగు మాట్లాడుతే
చెరుకు రసం తాగినంత తియ్యగ ఉంటది
మల్లెపువ్వుకు ఎంత పరిమళమో
తెలుగు భాషకు అంత సౌందర్యం
కోయిల పాట చెవికి ఎంత వినసొంపో
తెలుగు పలుకు మనసుకు అంత ఓదార్పు
ఇతర భాషలు అందమైన రంగుల పూలైతే
తెలుగు భాష మాత్రం
పరిమళం వెదజల్లే మల్లెపూవు
అమ్మ ఒడి ఎంత సౌఖ్యమో
తెలుగు భాష అంత సౌఖ్యం
తెలుగు మన మాట,
తెలుగు మన పాట
తెలుగు మన గుండె చప్పుడు
తెలుగు మన ఉనికి ఇప్పుడు
ఈ తియ్యని భాషను ప్రేమిద్దాం
రాబోయే తరాలకు అందిద్దాం

- కె.పూజిత

కలం – నా నేస్తం

కలం అంటే
కలలకి రెక్కలు తొడిగేది.
మన దగ్గర డబ్బు లేకున్నా సరే
ఒక కలం ఉంటే చాలు
మన జేబులో చిల్లిగవ్వ లేకున్నా పర్వాలేదు
కానీ మన వేళ్ల మధ్య ఒక కలం ఉంటే చాలు
ప్రపంచాన్ని జయించవచ్చు.
కలంలో సిరా అయిపోవచ్చు
కానీ ఈ కలం రాసే కథలు ఆగిపోవు
మనం కలంతో సంతకం పెట్టేది చిన్నదే
కానీ ఆ సంతకం మన జీవితాన్నే మారుస్తుంది
కలం అంటే మౌనానికి మాటలు నేర్పే గురువు
మన దగ్గర డబ్బు ఉంటే ఖర్చు పెట్టగలము
కానీ ఒక కలం ఉంటే చరిత్రనే సృష్టించగలము.
మనం బతకడానికి గాలి , నీరు, తిండి కావాలి
కానీ గెలవడానికి మాత్రం ఒక కలం కావాలి
మన చేతిలో ఉన్నది కలం కాదు
అది ఒక బ్రహ్మాస్త్రం లాంటిది
కలం పట్టుకొని కలలు కంటే
అవి రేపటి రోజుల్లో నిజం అవుతాయి
యుద్ధంలో కత్తి ఉన్నోడు సైనికుడైతే
చేతిలో కలం ఉన్నోడు రూలర్ అవుతాడు.
మన కోపాన్ని కాగితం మీద ఖాళీచేసి
మనని ప్రశాంతంగా మారుస్తుంది
కలం అంటే పరీక్ష గదిలో మన ఆయుధం
ధైర్యంలో మన నిజమైన స్నేహితుడు
కలం చూడానికే చిన్నగా ఉంటుంది
కానీ అది మోసే బాధ్యత చాలా ఎక్కువ
కలం నాకు దారి చూపే మార్గదర్శి
నా కలలను నిజం చేసే కలం
నాకెప్పుడూ ప్రాణనేస్తమే.

- బి.అక్షయ

నాడు – నేడు

నాడు అమ్మమ్మ చెప్పిన నీతి కథలు
నేడు యూట్యూబ్ లోని రీల్స్ వింతలు
నాడు వీధుల్లో ఆడిన తొక్కుడుబిల్ల ఆటలు
నేడు గదుల్లో ఫోన్లో ఆన్ లైన్ వేటలు
నాడు ఇంటి నిండ చుట్టాల సందడి
నేడు ఎవరి లోకం వారికే
చాలని సమయం
నాడు అందరు కలిసి జరుపుకునే పండుగలు
నేడేమో ఆన్ లైన్ లో పంపుకునే శుభాకాంక్షలు
నాడు సూర్యుదయంతో నిద్రలేచే కాలం
నేడు అర్ధరాత్రి దాక ఫోన్లలో మునిగిన మానవ లోకం
నాడు బావి నీటితో చేసే స్నానాలు
నేడు షవర్ల కింద చేసే స్నానాలు
నాడు సైకిళ్ళ మీద సాగిన ప్రయాణం
నేడు బైకుల మీద తిరిగి చేస్తున్న కాలుష్యం
నాడు కంచంలో అమ్మ వడ్డించే కమ్మని వంటలు
నేడు ప్యాకెట్లలో దొరికే జంక్ ఫుడ్లు
నాడు వానలో కాగితం పడవల ఆటలు
నేడు కంప్యూటర్లలో కీబోర్డు అక్షరాల మాటలు
నాడు ప్రకృతి ఒడిలో పెరిగిన స్వచ్ఛమైన జీవనం
నేడు మనిషి ప్రకృతిని చేస్తున్న నాశనం
వినాశకాలే విపరీత బుద్ధి

- ఎమ్.సాయి కృతిక

ఓ తాతా!

తాతా!
నీ మాటల్లోని గాంభీర్యం
మమ్మల్ని వెన్నుతట్టేవి
ఇప్పుడా మాటలు లేక
ఇల్లు వెలవెల బోయింది.
నాన్నకు ఏ కష్టం వచ్చినా
నువ్వున్నావన్న ధైర్యంతో ఉండేవాడు
కానీ,నువ్వు మాతో లేవన్న విషయం
మా గుండెలను కోతకోస్తున్నాయి.
అమ్మ అంటే ఎంత ప్రేమ చూపేవాడివి
ఎంత గౌరవంతో మెలిగేవాడివి
అమ్మకి చిన్న గాయం అయితే
తన బాధను నీ బాధగా చేసుకొని
ఓదార్చేవాడివి.
ఉన్న చిన్న పొలం అయినా
దాంతో పొద్దు గడిపేవాడివి
ఏ వేళ అయినా ఇంటికి వచ్చేవాడివి
నీ రాకతో ఇల్లు ఆనందంతో నిండిపోయేది.
నేను ఎంత అల్లరి చేసినా
కొండంత ఓర్పుతో భరించేవాడివి
గారాబం చేసేవాడివి.
చంద్రుడిలాంటి చల్లని మనసుతో
గోరుముద్దలు పెట్టేవాడివి.
నేను కళ్ళు మూసుకున్నప్పుడు ఆదరించావ్!
కళ్ళు తెరిచాక ఏడిపిస్తున్నావ్!
ఎందుకు తాత ఇలా చేస్తున్నావ్!
ఏ వేళ అయినా ఇంటికి వచ్చే నువ్వు
ఇంకా రాలేదని రోజూ ఎదురుచూస్తున్నాం.
మళ్ళీ ఒక్కసారైనా వచ్చిపో తాత!
ఒక్కసారైనా వచ్చిపో

-ఆర్.సింధుప్రియ

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.

